# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 27-05-2022 ₹15/-




# మరోసారి బాబరీ

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 21 హైదరాబాద్
శుక్రవారం 27 మే 2022 రూ.15-00
25 షవ్వాల్ 1443 హిజ్రీ

**తొలిగీటు**

మానవుడిలో ఉండే అన్నింటికన్నా చెడ్డ గుణం, లోలోనే కృంగదీసే అత్యాశ. భయభీతిని పురిగొలిపే పిరికితనం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**
**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**
**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**
**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**
గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**
సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**
సేల్స్ మేనేజర్
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com



16

**పిల్లల్లో పోషకాహార లోపం**

## లోపల...


| | | |
|---|---|---|
| చింతన్ శిబిర్ సాధించిందేమిటి? | ...... | 04 |
| మరోసారి బాబరీ | ...... | 05 |
| సామరస్యానికి, సౌహార్ధానికి, సదవగాహనకు ప్రతీక | ...... | 08 |
| చరితార్థులు– మియాన్ అక్బర్ షాహ్ | ...... | 13 |
| శాంతి స్థాపన మనందరి కర్తవ్యం! | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఆదాబ్ డాక్టర్ అమర్‌నాథ్ సాబ్ | ...... | 21 |
| మేరాజ్ ఆరోహణం | ...... | 22 |
| సిగరెట్ స్మోకింగ్‌తో ఆరోగ్య సమస్యలు ఎన్నో! | ...... | 26 |
| మనసును వెలిగించే దీపం నమాజ్ | ...... | 28 |
| ప్రేమోన్మాదానికి అంతం ఎప్పుడు? | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| పరుల సొమ్ము పాము వంటిది | ...... | 34 |


**ఏంటి మీరు చేసిందీ.??**



ఏమి కొనేటట్టులేదు
ఏమి తినేటట్టులేదు
నిత్యావసర వస్తువేది
అందుబాటులో లేదు!
అది జేశాం ఇది జేశాం
అంటున్న ప్రభుత్వాలు
మాయజేసి మభ్యపెట్టి
చెబుతున్న కవిత్వాలు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన చింతన్ శిబిర్ సాధించిందేమిటి?

**ఉదయ్‌పూర్‌లో** కాంగ్రెస్ చింతన్ శిబిర్ జరిగింది. చివరి రోజు రాహుల్ గాంధీ మాట్లాడాడు. ఆయన మాట్లాడిన మాటలు చాలా మంది ప్రాంతీయ నాయకులకు నచ్చలేదు. నచ్చే మాటలు కూడా కాదు. ఆయన ఏం చెప్పాడంటే, భారతీయ జనతాపార్టీ కేవలం కాంగ్రెస్ గురించి మాత్రమే మాట్లాడుతుంది. కాంగ్రెస్ నేతల గురించి మాత్రమే మాట్లాడు తుంది. కాని ప్రాంతీయ పార్టీల గురించి, ప్రాంతీయ పార్టీ నేతల గురించి మాట్లాడదు. ఎందుకంటే బీజేపీకి తెలుసు, కాంగ్రెస్ కు మాత్రమే బీజేపీని ఓడించే సామర్థ్యం ఉందని. ప్రాంతీయ పార్టీల ప్రాముఖ్యత ఉన్నప్పటికీ అవి బీజేపీని ఓడించలేవు, ఎందుకంటే వాటికి సైద్ధాంతిక బలం లేదు అన్నాడు.

సహజంగానే ఈ మాటలు ప్రాంతీయ పార్టీలకు నచ్చవు. అలాగే చాలా మంది కాంగ్రెసు ప్రస్తుత పరిస్థితి చూపించి రాహుల్ మాటలను హేళన చేయడం కూడా చూస్తున్నాము. కాని కాస్త ఆలోచిస్తే రాహుల్ మాటల్లో నిజముందని తెలు స్తోంది. అలాగే కాంగ్రెసు బలం పుంజుకోవడంలో తానే పెద్ద అడ్డంకి అనే వాస్తవం కూడా రాహుల్ అర్థం చేసు కోవడం లేదన్నది కూడా స్పష్టమవుతుంది.

కాంగ్రెస్ ఇప్పుడు పూర్తిగా బలహీనపడింది. వరుస ఓట ముల్లో చిక్కుకుపోయింది. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసు ఉనికి లేకుండా పోయింది. అయినప్పటికీ నేటికి కూడా బీజేపీ ప్రధానంగా కాంగ్రెసుపైనే దాడి చేస్తుంది. రాహుల్ గాంధీని ఒక పప్పుగా చూపించడానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రచారం కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేస్తుంది. రాహుల్ గాంధీ వల్ల బీజేపీకి కాని, నరేంద్రమోడీకి కాని ఎలాంటి ప్రమా దమూ లేదు. అయినా ఎందుకు కాంగ్రెసును, రాహుల్ గాంధీని మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారన్నది ఆలోచిం చవలసిన ప్రశ్న. ప్రాంతీయ పార్టీలను బీజేపీ లక్ష్యంగా చేసుకోవడం అనేది చాలా అరుదు. ఎందుకిలా జరుగు తోంది?

ఈ ప్రశ్నకు జవాబు చాలా సులభం. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఏ ఒక్క ప్రాంతీయ పార్టీ వల్ల అయ్యే పని కాదు. తృణమూల్ కాంగ్రెసు బెంగాల్లో బలంగా ఉండ వచ్చు. కాని సాధారణ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెసుకు బెంగాల్ నుంచి వచ్చే స్థానాలు మహా అయితే 40 మాత్రమే. కాబట్టి బీజేపీకి పెద్దగా ఆందోళన లేదు. కాని కాంగ్రెసు అలా కాదు. కాంగ్రెసు బలం పుంజుకుంటే బీజేపీకి ప్రమాదం. దాదాపు 150 నుంచి 200 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి బలమైన పోటీ తప్పదు. ఈ స్థానాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ చాలా బలహీనంగా ఉన్నప్పటికీ బలం పుంజుకుంటే మాత్రం బీజేపికి ప్రమాదమే.

రాహుల్ గాంధీ మాటల్లో ఈ లెక్కలే ఉన్నాయి. కాంగ్రెసు వెంటనే బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చే స్థాయికి చేరుకోలేక పోవచ్చు. కాని కాస్త బలం పుంజుకున్నా బీజేపీ స్థానాలు తగ్గిపోతాయి. బీజేపీకి ప్రాంతీయ పార్టీలపై ఆధారపడే పరిస్థితి రావచ్చు. ప్రాంతీయ పార్టీలకు సైద్ధాంతిక బలం లేదని రాహుల్ చెప్పిన మాటల్లోను వాస్తవం ఉంది. ప్రాంతీయ పార్టీలన్నీ కులం లేదా ప్రాంతం ప్రాతిపదికన ఏర్పడినవి. సిద్ధాంత భూమిక బలమైనది కాదు. తృణమూల్ కాంగ్రెసు సైద్ధాంతికమైన పార్టీ అయితే ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ప్రభావం చూపించి ఉండేది. ఆప్ పార్టీ సైద్ధాంతికంగా బలమైన పార్టీగా నిరూపించుకునే ప్రయత్నాల్లో ఉంది. పంజాబులో సాధించిన విజయం ఈ ప్రయత్నాలకు కొంత ఊతం ఇవ్వవచ్చు. కాని ఆప్ ప్రభావం యావత్తు దేశంలో లేదు. బహుజన సమాజ్ పార్టీ వంటి పార్టీలు అవసరమైనప్పుడు బీజేపీకి ఊతమిచ్చిన పార్టీలే. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాంతీయ పార్టీలు బీజేపీ శిబిరంలో దూకడానికి వెనుకాడవు. కాబట్టి రాహుల్ గాంధీ చెప్పిన మాటలను చాలా మంది అవహేళన చేస్తున్నప్పటికీ అందులో నిజం ఉంది.

మరో నిజం ఏమిటంటే, కాంగ్రెసు గత రెండు ఎన్నికల్లో దారుణంగా ఓడిపోవడం రాహుల్ నేతృత్వంలోనే జరిగింది. రాహుల్ గాంధీ ఈ వాస్తవాన్ని గ్రహించి, పార్టీ కోసం తన పదవిని వదిలి పక్కకు తప్పుకోవలసిన అవసరం ఉంది. కాంగ్రెసులో అనేకమంది సమర్థులైన నేతలున్నారు. వారిని ముందుకు తీసుకురావలసిన అవసరం ఉంది. గాంధీ కుటుంబం అనే ముద్ర నుంచి బయటపడినప్పుడే కాంగ్రెసు పునరుత్థానం సాధ్యపడుతుంది.

అబ్దుల్ వాహెద్




## బాబరీ 1992 ... జ్ఞానవాపి 2022

బీజేపీ మాజీ ఎమ్మెల్యే సంగీత్ సోమ్ బెదిరింపు ధోరణిలో చెప్పిన మాటలివి. 1992 నుంచి 2022 నాటికి యువశక్తి మరింత పెరిగింది, ఇప్పుడు మరో నిర్ణయం తీసుకోవలసిన సమయం వచ్చిందన్నాడు. జ్ఞానవాపి మస్జిదును హస్తగతం చేసుకోవాలని పిలుపునిచ్చాడు.

జ్ఞానవాపి మస్జిదు వారణాసిలో ఉంది. అక్కడ వీడియో సర్వే చేయించాలని కోర్టు కూడా ఆదేశాలు జారి చేసింది.

వారణాసి మస్జిదు వద్ద హిందూ దేవత శృంగార్ గౌరీ చిత్రం గోడపై ఉందని అక్కడ పూజలు చేసుకోడానికి అనుమతి ఇవ్వాలని కొందరు హిందూ మహిళలు కోర్టులో కేసు వేశారు. ఈ మస్జిదులో నమాజుకు ముందు వుజూ చేసుకునే చోట శివలింగం ఉందని మరో వాదన మొదలైంది. కాని అది శివలింగం కాదని నీటిని విరజిమ్మడానికి నిర్మించిన ఫౌంటెన్ నిర్మాణమని మస్జిదు కమిటి వాదిస్తోంది. ఫౌంటెన్లు చాలా వరకు అలాంటి నిర్మాణమే కలిగి ఉంటాయి. కాని ఈ వాద నేదీ వినకుండానే, అసలు వీడియో సర్వే రిపోర్టు రాకముందే కోర్టు కూడా ఆ ప్రాంతాన్ని సీలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

శివలింగం కనిపించిందనే వార్త రాగానే ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఆ మస్జిదులో శివలింగం కనిపించడం దేశంలో తనలాంటి శివభక్తులందరికీ ఇది శుభవార్త అన్నాడు. ఈ విషయంలో కోర్టు ఆదేశాలను శిరసావహిస్తామని చాలా వినయంగా చెప్పారు.

మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ 1949లో

బాబరీ విషయంలో ఏం జరిగిందో అదే ఇప్పుడు వారణాసి మస్జిదు విషయంలోను ప్రారంభించారని విమర్శించారు. కోర్టు ఆదేశాలు 1991 ధార్మిక ప్రదేశాల చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని అన్నారు.

వారణాసిలో జరుగుతున్న పరిణామాలను చూస్తున్నప్పుడు చరిత్రలో బాబరీ వివాదంలో ఏం జరిగిందన్నది కూడా ఒకసారి పరిశీలించడం అవసరం.

బాబరీ మస్జిదు విషయంలో 1986లో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులే ఆ తర్వాత బాబరీ వివాదం రాజుకుని, చివరకు మస్జిదు కూల్చివేతకు కారణమయ్యాయి. ఈ మాటలు చెప్పింది అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి. 2010లో అయోధ్య కేసులో తీర్పు సందర్భంగా జస్టిస్ యస్.యు. ఖాన్ ఈ మాటలు చెప్పారు.

1986లో కోర్టు తీర్పుకు ముందు బాబరీ వివాదం గురించి దేశంలో చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. బాబరీ వివాదంలోను అక్కడ విగ్రహం వెలిసిందనే వార్త ప్రచారంలో పెట్టారు. వారణాసి మస్జిదు విషయంలోను ఇక్కడ శివ లింగం ఉందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇది ఇక్కడితో ఆగేది కూడా కాదు. రెచ్చగొట్టే రాజకీయాలు ఎన్నికల ప్రయోజ నాలను సాధిస్తున్నంత కాలం వారణాసి, మధుర, కుతుబ్ మినార్, తాజ్ మహల్ ఇలా అనేక వివాదాలు ముందుకు ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉండవచ్చు.

1949లో బాబరీ మస్జిదులో అర్థరాత్రి రాముడి విగ్రహం వెలిసిందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు వారణాసి మస్జిదులో శివలింగం ఉందనే వార్త ప్రచారం అందుకుంటోంది.

వారణాసిలోని జ్ఞానవాపి మస్జిదు ముగల్ కాలంలో కట్టిన మస్జిదు. వార ణాసి కోర్టుల్లో ఈ మస్జిదుపై దాఖలైన కేసులు ఈ వివాదానికి కావలసిన ప్రచారాన్నిచ్చాయి. ఇప్పుడు నెమ్మదిగా దేశరాజకీయాల్లో బాబరీ స్థానాన్ని వారణాసి జ్ఞానవాపి మస్జిదు తీసుకో బోతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

దేశంలో ధరలు ఆకాశాన్నంటు తున్నాయి. నిరుద్యోగం పెరుగు తోంది. పెట్రోలు ధర ఆకాశాన్ని దాటింది. రూపాయి మారకం రేటు పడిపోతోంది. కాని ప్రజలు ఈ సమస్యల గురించి చర్చిం చడం లేదు. బహుజన సమాజ్ పార్టీ నేత మాయావతి ఇదే విషయం గురించి మాట్లాడుతూ బీజేపీ తన వైఫల్యాలను కప్పిపుచ్చు కోడానికి ధార్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు నడిపిస్తుందని చెప్పారు. బీజేపీ రాజకీయాలు ఈ రోజు కొత్త కాదు. ఇవే రాజకీయాలతో బీజేపీ బలపడింద న్నది అబద్ధమూ కాదు. బహుజనసమాజ్ పార్టీ నేత కొత్తగా చెప్పింది ఏదీ లేదు. చాలా సెక్యులర్ పార్టీలు ఈ మాటలే చెబుతూ వస్తున్నాయి. కాని రాజకీయ ప్రయోజనాలకు అవసరమైనప్పుడు రాజీపడి, కూటములు కట్టి బతికే ప్రయ త్నాలు కూడా చేస్తూ వస్తున్నాయి.

ఇప్పుడు దేశంలోని ఇతర ప్రదేశాల్లో కూడా ఈ వివాదాలు విస్తరిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఒక దర్గా వద్ద హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రయత్నాలు జరిగాయి. ఘర్షణలు చెలరేగాయి.

ఇక జ్ఞానవాపి మస్జిదు విషయానికి వస్తే, దేశంలో ధార్మిక ప్రదేశాల పరిరక్షణ చట్టం ఉంది. 1947, ఆగష్టు 15వ తేదీన ఎలాంటి స్థితిలో ఉన్నాయో యథాతథ స్థితిని కాపాడా లని చట్టం స్పష్టంగా చెబుతోంది. కాని వారణాసిలోని స్థానిక కోర్టు జ్ఞానవాపి మస్జిదులో శివలింగం కనిపించిందనే వార్త ఆధారంగా ఆ ప్రాంతాన్ని సీలు చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు స్థానిక కోర్టు నిషేధాలను తొలగించినప్పటికీ స్థానిక కోర్టు శివలింగం ఉన్న ప్రదేశం గురించి ఇచ్చిన ఆదేశా లను మార్చలేదు. ధార్మిక ప్రదేశాల పరిరక్షణ చట్టం అలా చూస్తూనే ఉండిపోయింది.


# ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

# 1800 572 3000

మధురలోని ఈద్గా కృష్ణజన్మభూమి అని అక్కడ కూడా వీడియో సర్వే చేయించాలంటూ పిటీషన్లు దాఖలయ్యాయి. కర్నాటక లోని శ్రీరంగపట్నం జామా మస్జిదులో కూడా సర్వే చేయించాలని అది కూడా మందిరమే అని మరో వాదన మొదలైంది. అక్కడ హనుమాన్ మందిరం ఉండేదని వాదిస్తున్నారు. ఇంకా చాలా చోట్ల ఈ పరంపర కొనసాగవచ్చు. ఇది లాభసాటి రాజకీయం.

కోర్టులో కేసులు వేయడం, కోర్టులు సర్వేలకు ఆదేశించడం, సర్వేలో కనిపించిన ఏదో ఒక విషయాన్ని ప్రచారంలో పెట్టడం, దానికి సంబంధించిన నిజానిజాలు తేలే లోపునే ప్రజల భావావేశాలతో దాన్ని ముడివేయడం, వివాదాన్ని చిక్కుముడిగా మార్చడం... ఒక ప్రక్రియగా మారింది.

ధార్మిక ప్రదేశాల పరిరక్షణ చట్టం దేశంలో ఉంది. అయినా వారణాసి మస్జిదులో వీడియో సర్వే చేయించాలని స్థానిక కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా వీడియో సర్వేను ఆపలేదు. సాధారణంగా కోర్టులు జాగ్రత్తగా, ఆచితూచి పని చేస్తాయి కాబట్టి కోర్టుల్లో పనులు ఆలస్యమవుతుంటాయి. కాని వారణాసి జ్ఞానవాపి మస్జిదు విషయంలో అలాంటి ఆలస్యమేదీ కనిపించదు. శరవేగంగా అన్నీ జరిగిపోతున్నాయి.

జ్ఞానవాపి మస్జిదు వివాదాన్ని రాజేయడానికి గతంలోను చాలా ప్రయత్నాలు జరిగాయి. కాని అలహాబాద్ హైకోర్టు ఈ ప్రయత్నాలను చాలా వరకు నివారించింది. కాని ఇప్పుడు ఈ వివాదం రాజకీయంగా ముఖ్యమైన వివాదంగా మారినట్లు కనిపిస్తోంది. మరోసారి బాబరీ వాతావరణం దేశంలో అలుముకుంటోంది.

దేశంలో ముస్లిముల ధార్మిక ప్రదేశాలపై జరుగుతున్న దాడుల గురించి ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆందోళన వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో తమ వైఖరి స్పష్టం చేయాలని కోరింది.

ఏది ఏమైనా, బాబరీ తర్వాత ఇప్పుడు జ్ఞానవాపి, ఆ తర్వాత మరో ప్రదేశం ... ఈ జాబితా చాలా పెద్దది.

మతతత్వ రాజకీయాలు లాభసాటిగా కొనసాగినంత కాలం దేశంలో అధిక ధరలు, పేదరికం, నిరుద్యోగం వంటివి ప్రధాన సమస్యలుగా మారవు. ✤

# నిత్య జీవితంలో భాగం అజాన్

## మస్జిద్ నుంచి లౌడ్‌స్పీకర్లు తొలగించకూడదని గ్రామస్తుల తీర్మానం



దేశవ్యాప్తంగా లౌడ్‌స్పీకర్లపై వివాదం నెలకొన్న నేపథ్యంలో మహారాష్ట్రలోని ఒక గ్రామ ప్రజలు అజాన్ పట్ల తమకున్న ఇష్టాన్ని ఘనంగా చాటుకున్నారు. ఆ గ్రామంలో ఉన్న ఒకే ఒక్క మస్జిద్‌లోని లౌడ్ స్పీకర్‌ను తొలగించవద్దని తీర్మానించుకున్నారు. "అజాన్ మా నిత్యజీవితంలో భాగమైపోయింది. అజాన్ వల్ల మాకు ఎటువంటి ఇబ్బంది లేదు" అని ప్రకటించారు.

వివరాల్లోకి వెళితే... అది మహారాష్ట్రలోని జాల్నా జిల్లాలోని ధన్‌సలా పీర్‌వాడీ గ్రామ పంచాయితీ. ఈ గ్రామ జనాభా 2500. ఇందులో 600 ముస్లిమ్ కుటుంబాలున్నాయి. 24 ఏప్రిల్ 2022న గ్రామ ప్రజలు గ్రామ సభ నిర్వహించారు. ఆ సభలో ఆ ఊరి ప్రజలందరూ కలసి తమ గ్రామ మస్జిద్‌లోని లౌడ్ స్పీకర్లు తొలగించేది లేదని తీర్మానం చేశారు. ఒక ఛానెల్‌తో ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ రామ్‌పాటిల్ మాట్లాడుతూ, మా గ్రామంలో అనేక కులాల వారున్నారు. ఇక్కడ దాదాపు 600 ముస్లిమ్ కుటుంబాలున్నాయి. ఏళ్ళ తరబడి శాంతి సామరస్యాలతో మేము జీవితం గడుపుతున్నాము అన్నారు.

తీర్మానంలో అజాన్ ఆధారంగా జీవిత వ్యవహారాలు ముడిపడి ఉన్నాయని ఆసక్తికర ప్రస్తావన చేశారు. 'అజాన్ గ్రామవాసులకు ఒక జీవిత విధానంగా మారింది. దాని ఆధారంగానే మేమంతా పనులను నిర్వహించుకుంటుంటాము. ఉదాహరణకు- ఫజ్ర్ అజాన్ అయినప్పుడు పెందలకడనే నిద్ర లేచి పనులు ప్రారంభించుకుంటాము. జొహ్ర్ అజాన్ తరువాత భోజనం కోసం విశ్రాంతి తీసుకుంటాము. అస్ర్ అజాన్ పని ముగిసిందని సూచిస్తుంది. మగ్రిబ్ అజాన్ రాత్రి భోజనానికి వేళయిందని తెలుపుతుంది. చివరగా ఇషా నమాజ్ తరువాత ప్రతి ఒక్కరూ నిద్రపోవడానికి సంసిద్ధులవుతారు. ఇలా అజాన్ వేళలను బట్టి మా జీవిత వ్యవహారాలను చేసుకుంటూ పోతాం" అని తీర్మానంలో పేర్కొన్నారు. ఎవరికయినా అజాన్ పట్ల అభ్యంతరం ఉంటే లౌడ్‌స్పీకర్ శబ్దాన్ని తగ్గిస్తామని మస్జిద్ ఇమామ్ మౌల్వీ మీర్జా జాహిర్ బేగ్ గ్రామసభకు తెలిపారు.

మన దేశం పరస్పర సోదరభావం, సౌభ్రాతృత్వం, సుహృద్భావం, భిన్నత్వంలో ఏకత్వానికి నిలయం. కాని కొంతకాలం నుంచి మతం పేర రాజకీయాలు నడిపేవారు దేశ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. అలాంటి తరుణంలో ఈ చిన్న గ్రామం దేశంలో విద్వేష బీజాలు నాటాలనుకునేవారికి మానవత, సోదరభావ గుణపాఠం నేర్పుతుంది. ***('దావత్' సౌజన్యంతో...)***




**తెలుగు వక్త, ఖుర్ఆన్ హదీసు గ్రంథాల అనువాదకులు, రచయిత జనాబ్ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారు హైదరాబాద్‌లో జరిగిన ఈద్‌మిలాప్ కార్యక్రమంలో ప్రసంగించి అమూల్యమైన సందేశమిచ్చారు. ఆ ప్రసంగం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. మరెంతోమంది మిత్రులు ఈ ప్రసంగం వ్యాసరూపంలో రావాలన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. అందుకే ఆ ప్రసంగ పాఠానికి అక్షర రూపమిది.**

**- హాఫిజ్ ముహమ్మద్ ఖాసిమ్ షర్ఫీ**

## ముదావహం

ఆదరణీయులైన నగర ప్రముఖులకు, వాణిజ్యవేత్తలకు, విజ్ఞులకు, మేథావులకు- అందరికీ స్వాగతం, సుస్వాగతం. పండుగ తర్వాత ఈద్‌మిలాప్ పేరుతో ఒక చిన్న గ్యాదరింగ్‌ని మిత్రులు సయీదుల్లాఖాన్ గారు ఈ రోజు (8-5-22న) తుర్కయమ్జాల్ లోని హెూటల్ 'టులిప్స్ గ్రాండ్'లో పండుగ సంతోషాన్ని అందరితో కలసి పంచుకోవాలన్న ఆశతో, ఆశయంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నన్ను కూడా ఆహ్వానించారు. ఈ శుభ సందర్భంగా పర్వదినం పరమార్థం ఏమిటో క్లుప్తంగా తెలియజేయమని కోరారు.

సహెూదరులారా!

ఈ సభ ఉద్దేశం ఆత్మీయ కలయిక.

సంఘీభావానికి, సామరస్యానికి, సహిష్ణుతకి, సౌహార్ధానికి, సద్భావనకు ప్రతీకగా ఈ సమావేశాన్ని ఇక్కడ ఏర్పాటు చేసుకున్నారు.

రమజాన్ మాసంలో 30 రోజులపాటు కఠోరమైన ఉపవాసాలను విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు ముస్లింలు దైవానికి కృతజ్ఞతగా జరుపుకునే పండుగ పేరే రమజాన్ పండుగ. ఈ శుభ సందర్భంగా వారి అంతరాళం ఆనందాతిశయంతో ఉవ్విళ్ళూరుతుండగా వారి అధరాలు ఆలాపించే స్తుతి గీతిక ఒకటి ఉంటుంది. పండుగ రోజు ఈద్గాహ్‌కి వెళ్లేటప్పుడు గానివ్వండి, ఈద్గాహ్ నుండి తిరిగి వచ్చేటప్పుడు గానివ్వండి వారి అధరాల మీదుగా జాలువారే స్తుతి గీతిక **'అల్లాహు అక్బర్ - అల్లాహు అక్బర్ - లా యిలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్**. (దేవుడే గొప్పవాడు, నిశ్చయంగా దేవుడే గొప్పవాడు. అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్య దైవం లేనేలేడు. దేవుడే గొప్పవాడు, ప్రశంసలు, పొగడ్తలు, స్తోత్రములన్నీ ఆ దైవానికే శోభిస్తాయి). ఇదీ ఈ శుభ సందర్భంగా

వారు పలికే దైవస్తోత్ర వచనాలు, దైవకీర్తన. అంటే వారు ఈ దైవకీర్తన పలుకుల ద్వారా చాటి చెప్పేదేమిటంటే మేమంతా మనుషులం. సృష్టికర్తలము కాము, సృష్టించబడినవాళ్ళము. కాబట్టి సృష్టికర్త గొప్పతనాన్ని కీర్తించటమే మాకు శోభాయ మానం. ఇదీ ఈ పలుకుల్లోని ఆంతర్యం.

నలువైపులా సంతోషాల సప్తరంగుల హరివిల్లు వెల్లివిరియగా, వాతావరణం ఆనంద రాగ సరాగ సంశోభితమవగా, నవ్వుల కెరటాలు జీవితంలో రసమయ మాధురిని నింపగా అసంఖ్యాక మైన శుభ సందేశాలతో అవతరిస్తుంది రమజాన్ పండుగ.

పండుగపూట పరిశుభ్రత, పరిశుద్ధతలతోపాటు కొత్త బట్టల తళ తళలూ ఉంటాయి. పండుగ పూట హార్దిక శుభాకాంక్షల ప్రేమైక వచనాల కుసుమాలు ఉంటాయి. పండుగ పూట హృదయానికి ఆహ్లాదాన్ని ఇచ్చే సుగంధ ద్రవ్యాల గుబాళింపు ఉంటుంది. పండుగపూట మనసుకు, మస్తిష్కానికి తృప్తిని, శక్తినీ ఇచ్చే రుచి కరమైన, ఇష్టకరమైన మధుర భక్ష్యాలు ఉంటాయి. పండుగ పూట అపార్థాల అడ్డుతెరల వల్ల దూరమైన హృదయాల సమ్మే ళనమూ ఉంటుంది. పండుగ పూట ఆనందంతో జలజలా కారే అశ్రుధారాలూ ఉంటాయి.

## సమానత్వానికి దర్పణం

కాని ధనాన్ని, మానాన్ని, ప్రాణాన్ని బలిగొనే వ్యర్థ వ్యసనాలకు, అశ్లీల పరాచికాలకు, అపసవ్యమైన పోకడలకు రమజాన్ పండుగలో ఏమాత్రం చోటు లేదు. మీరు గమనించారు, భారత దేశంలోని దాదాపు 15 కోట్ల మంది ముస్లిములు రమజాన్ పండుగ చేసుకున్నారు. ముస్లింలు ప్రతిరోజు ఐదు పూటల నమాజు చేస్తారు. కాని పండుగ రోజు ఆరు నమాజులున్నాయి. ఒక నమాజ్ అదనం. ఈద్గాహ్‌కు ఒక దారి గుండా వెళ్ళాలి మరో దారి గుండా తిరిగి రావాలి. వారు అక్కడకు వెళ్ళి వరుసలుతీరి నిలబడతారు. భుజానికి భుజం ఆనించి దైవసన్నిధిలో భక్తులంతా నిలబడతారు. వాళ్ళలో ధనికులూ ఉన్నారు, పేదవారూ ఉన్నారు. కార్మికులూ ఉన్నారు, యజమానులూ ఉన్నారు. వాణిజ్యవేత్తలూ ఉన్నారు, మామూలు ఉద్యోగులూ ఉన్నారు. వారిలో తెల్లవారూ ఉన్నారు, నల్లవారూ ఉన్నారు. కాని ఎవరు ముందుగా ఈద్గాహ్‌కు వస్తారో వారికే ముందు వరుసలో చోటు దక్కుతుంది. తరువాత వచ్చినవారు ధనికులైనా, వాణిజ్యవేత్త లైనా, రాజకీయ నాయకులైనా వెనుక నిలబడాల్సిందే. ఎందు కంటే ఇది దేవుని ప్రార్థనాలయం. దైవప్రార్థన కోసం వచ్చారు. అక్కడ ప్రముఖులకు ప్రాముఖ్యత ఇవ్వటం లాంటిది ఏమీ ఉండదు. ఈ సమతని, మమతని, సమానత్వ భావనని క్రియాత్మ కంగా ముస్లింలు ఈద్గాహ్ ప్రార్థనలలో చాటిచెబుతారు.

## ఇది ఫిత్రాల పండుగ

మిత్రులారా! రమజాన్ పండుగకి మరో పేరు 'ఈదుల్ ఫిత్ర్'. ఈదుల్ ఫిత్ర్ అంటే అర్థం ఫిత్రాల పండుగ. ఏమిటీ ఫిత్రా? అల్లాహుతఅలా నిర్దేశించాడు ముస్లింలకు- మీరు పండుగ పూట ఈద్గాహ్‌కు వెళ్ళక ముందు ఫిత్రా అనే దానాన్ని ఇవ్వాలి. ఎందుకు? మీరు బిర్యానీలు తిని, పాయసం త్రాగి హాయిగా గడుపుతారు పండుగ రోజు. కాని సమాజంలో పేదవారు కూడా ఉన్నారు. వాళ్ళ కనీస అవసరాలు కూడా తీరాలి. వాళ్ళు కూడా పండుగ సంతోషాల్లో పాల్గొనాలి. అదేవిధంగా రమజాన్ మాసంలో ముస్లింలు దానధర్మాలు చేస్తారు, సదఖా ఇస్తారు. జకాత్ ఇస్తారు. మీ దగ్గర ఒక లక్షరూపాయలు మీరు తిన్న తర్వాత సంవత్సరానికి మిగిలితే ఆ లక్ష రూపాయల మీద 2.5 శాతం చొప్పున రెండున్నర వేల రూపాయలు జకాత్ చెల్లించాలి. జకాత్ దానం కాదు. దేవుడు మీపై విధించిన విధి. ఏవిధంగానైతే మీరు నమాజు చేస్తున్నారో అదేవిధంగా మీరు సొసైటీకి జకాత్ చెల్లించాలి.

## ఖుర్‌ఆన్ అవతరణా మాసం

మిత్రులారా! ఇంతకుముందు నేను చెప్పినట్లు రమజాన్ మాసపు పూర్తి కళకు ఒకే ఒక కారణం ఉంది. అదే దివ్య ఖుర్‌ఆన్ అవత రణ. ఖుర్‌ఆన్ అవతరించిన నెల రమజాన్ నెల. రమజాన్ మాసంలో ఖుర్‌ఆన్ అవతరించింది. ఇది సమస్త మానవాళికి మార్గదర్శక గ్రంథం. ఖుర్‌ఆన్‌లో ఎక్కడ కూడా అది ముస్లింల కొరకు వచ్చిన గ్రంథం అని లేదు. మానవులందరి మార్గనిర్దేశన కొరకు ఎవరైతే ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడో ఆయన లోకేశ్వ రుడు. సమస్త మానవుల ప్రభువు ఆయన. మరి ఎవరిపైనైతే ఈ గ్రంథం అవతరించిందో ఆ ముహమ్మద్ ప్రవక్త(స) సకల లోకాలకు మూర్తీభవించిన కారుణ్యం. అలాగే ఇది దైవభీతిపరు లకు మార్గదర్శక గ్రంథం. దీన్ని మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో విషయం ఏమిటంటే, ఈ సభ యొక్క ఉద్దేశ్యం కేవలం సంస్కరణ, కరెక్షన్. సంస్కరణ అనేది మానవ సముదాయాలలో ఎంతో అవసరం. ఈ సంస్కరణ కేవలం వ్యక్తిగతంగా, సాముదాయికంగా, ఆధ్యాత్మికంగానే కాదు, రాజకీయ రంగంలో కూడా సంస్కరణ జరగాలి. ఆర్థిక రంగంలో కూడా సంస్కరణ జరగాలి. వాణిజ్య రంగంలో కూడా సంస్కరణ జరగాలి. సంస్కరణ అనేది సదా స్వాగతించదగినది, శ్లాఘించ దగినది, సహకరించదగినది కూడా.

## మంచిని ప్రేమించేవారు ముందుకు రావాలి

ఖుర్‌ఆన్‌లోని సూరె హూద్‌లో జాతుల ఉత్థాన పతనాల తెరల వెనుక జరిగిన వృత్తాంతాన్ని వివరించిన తరువాత ఒకే ఒక

వాక్యంలో సారాంశాన్ని తెలియపరిచాడు దేవుడు. "(ఓ ప్రవక్తా-స) పట్టణాలలో నివసించే ప్రజలలో కొందరైనా సరే సంస్కరణా ప్రియులు ఉండగా అటువంటి పట్టణాలను అన్యాయంగా, అకారణంగా తుదముట్టించడం నీ ప్రభువు విధానం కానే కాదు" (11: 117). దీన్నిబట్టి అర్థమయ్యేది ఏమిటంటే సమాజంలో మంచిని ప్రేమించేవారు, శాంతికాముకులు, సంస్కర్తలు, సదా అప్రమత్తులై ఉండాలి. మంచి కోసం పాటుపడాలి. సమాజంలో సామాజిక రుగ్మతలను, నైతికపు రుగ్మతలను దూరం చేయడానికి నడుం బిగించాలి. మనం ఉపవాసం పాటించాము, మన వరకు సంస్కరణ జరిగింది. అది సరిపోదు, సమాజంలో అవినీతి ప్రబలింది. మద్యపాన సేవనం, జూదం, వ్యభిచారం, మాదకద్రవ్యాల సేవనం వంటి చెడులు సర్వసామాన్యం అయిపోతున్నాయి. దాని వల్ల సమాజానికి హాని కలుగుతుంది. అలాగే హింస, విద్వేషం, సంకుచిత భావాలు, హక్కులను కొల్లగొట్టడం వంటివి, అరాచకం, అవ్యవస్థ తాండవమాడుతుంది. దాన్ని మీరు అడ్డుకోవాలి. సమాజంలో మంచి వారు లేరని కాదు, ఉన్నారండి. సంస్కర్తలు కూడా ఉన్నారు. మేథావులూ ఉన్నారు. మంచి గురించి పొద్దున్నుంచి సాయంత్రం వరకు ఆలోచించేవారు కూడా ఉన్నారు. కాని సమస్య ఏమిటంటే, ఈ మేథావుల్లో, ఈ విజ్ఞుల్లో, ఈ సంస్కర్తల్లో... ఒక విధమైనటువంటి నిర్లిప్తత, నిస్సహాయ స్థితి, స్తబ్ధత ఆవరించింది. ఇది మంచి లక్షణం కాదు. సమాజంలో చెడు, దుర్మార్గం, ఎక్కడ జరిగినా దానికి వ్యతిరేకంగా స్పందించే గుణం మనలో ఉండాలి. స్పందన లేని సమాజానికి మనుగడ లేదు. ముహమ్మద్ ప్రవక్త (స) గారు ఒక సందర్భంగా అన్నారు: "మీరు ఒక దుర్మార్గునికి కూడా సహాయం చేయండి. ఒక బాధిత వ్యక్తికి, పీడిత వ్యక్తికి కూడా సహాయం చేయండి" అని. అనుచరులకు ఈ విషయం అర్థం కాలేదు. 'ఓ దైవప్రవక్తా! మీరు ఒక బాధిత వ్యక్తికి సహాయం చేయమన్నారు- విషయం అర్థమయింది. కాని ఒక దుర్మార్గునికి సహాయం చేయడం ఎలా?' అని అడిగితే "దుర్మార్గుడు దుర్మార్గానికి ఒడిగట్టకుండా అతని చెయ్యిపట్టి ఆపాలి. ఇదే మీరు అతనికి చేసే సహాయం" అన్నారు.

## సకల సంస్కృతుల సంగమం

సహోదరులారా! భారతదేశం సకల సంస్కృతుల సంగమం. ఇక్కడ రుషులు, మునులు, మహర్షులు, సంస్కర్తలు, దైవ ప్రవక్తలు ప్రభవించారు. వారంతా మానవాళికి దైవభక్తిని, నైతిక రీతిని ప్రబోధించారు. సహిష్టుతా భావాన్ని, సామరస్యాన్ని నూరిపోశారు. కొట్టుకు చావండి అని ఎవరూ చెప్పలేదు. కవి ఇక్బాల్ మాటల్లో చెప్పాలంటే...

"గుర్తుందా, ఓ గంగా ప్రవాహ జలధారా!
మా బిడారు నిలిపిన గుడారు ఒడ్డున నిటారుగా
ఆనాడే యదలో తీపిని నింపిన నా దేశం
విశ్వంలోనే విశిష్టమైనది నా దేశం
కోకిలనేనా నందనవనమది నా దేశం
ఏ దిశ పోయినా, ఎక్కడ ఉన్నా నా దేశం
మదిలో పొంగి నిండుగ నుండును నా దేశం"

నేను దాపరికం లేకుండా, నిర్మొహమాటంగా ఒక విషయం చెప్తానండి. ఆధ్యాత్మికంగా, యావత్ ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించగల సత్తా ఏదైనా దేశానికి ఉందంటే అది భారతదేశానికే. కాని మనం మనకు వారసత్వంగా ఉచితంగా లభించిన అపూర్వమైన ఈ సంపదని, ఈ సంస్కృతిని, ఈ సభ్యతని, ఈ సంస్కారాన్ని మరచిపోవటమేకాకుండా మన నవతరాలను కూడా మనం నిర్లక్ష్యం చేస్తున్నాము. మన నవతరం ఎటుపోతోంది? కేవలం డబ్బు సంపాదించడమే మన లక్ష్యం కారాదు. మన విలువలు, మన మూలాలు ఏవైతే ఉన్నాయో, వాటిని మనం కాపాడుకుంటూ ముందుకు సాగవలసిన ఆవశ్యకత ఉంది. మన ఉనికి వల్ల దేశానికి, సమాజానికి, మన కుటుంబానికి, మన గ్రామానికి, మన రాష్ట్రానికి మేలు కలగాలి. లేకుంటే మన అభివృద్ధికి, మన ప్రగతికి అర్థమే లేదు. దైవగ్రంథాలు మనకు చాటి చెప్పేది కూడా ఇదే. ఒక సత్పురుషునిగా, ఒక సంస్కర్తగా, ఒక శ్రేయోభిలాషిగా, దేశానికి ప్రయోజనం చేకూర్చే వ్యక్తిగా మనం మన ఉనికిని మలచుకోవాలి. మన ఉనికి లోకానికి కారుణ్యప్రదం కావాలి. అంతేగాని, హానికరంగా పరిణమించకూడదు.

రమజాన్ మాసంగాని, ఖుర్ఆన్ గ్రంథంకాని మనకు చెప్పేది ఇదే.

## 'తఖ్వా'

దేవుడు క్షమాగుణం కలవాడు. కాబట్టి మీరు క్షమ వైపునకు త్వరపడాలి. మీరు మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు త్వరపడండి. ఆ స్వర్గం వైపునకు పరుగెత్తండి, అది భూమ్యాకాశాలంత విశాలమైనది మరి. అది ఎవరికోసం సిద్ధం చేయబడింది? అది భయభక్తులు గలవారికోసం, సదాచార సంపన్నుల కోసం సిద్ధం చేయబడింది. వారి లక్షణాలేంటి? వారు ఎలా వుంటారు? దానికి కూడా సమాధానం చెప్పడం జరిగింది. వారు కలిమిలోనూ, లేమిలోనూ దైవమార్గంలో ఖర్చుపెట్టేవారై ఉంటారు. పేదలను ఆదుకునే వారై ఉంటారు. వారు ఉన్నప్పుడు కూడా ఇస్తారు, లేనప్పుడు కూడా ఇస్తారు. అంతేకాదు, వాళ్ళ మరో లక్షణం ఏమిటి అంటే వారు కోపాన్ని దిగమ్రింగేవారై ఉంటారు. ఆవేశాన్ని అణచిపెట్టుకునేవారై ఉంటారు. నెమ్మదిని, నింపాదిని, సౌమ్య

మనసును అలవరచుకున్నవారై ఉంటారు. సుమతి శతకంలో చెప్పటమైనది. సుమతి శతకంలోని ఒక పద్యం 'తన కోపమే తనకు శత్రువు, తన శాంతమే తనకు రక్ష. దయ చుట్టంబవు...' దయ, జాలి, కరుణ, ప్రేమ, లజ్జా, విజ్ఞత, ఔచిత్యం- ఇవి మనకు అలవడాలి. ధర్మం చెప్పేది కూడా ఇదే. రమజాన్ మాసం మనకు ఇచ్చేటటువంటి శిక్షణ ఇదే. ఖుర్‌ఆన్‌లో ఏమనబడింది? ఈ ఉపవాసాల ద్వారా మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది అని అనబడింది. దీన్నే 'తఖ్వా' అంటారు. ఇది పైకి కనబడేటటువంటిది కాదు. ఉదాహరణకు దీని నిర్వచనం మనం అబ్దులాహ్ బిన్ ఉమర్(రజి) అనే మహనీయుని సంఘటన ద్వారా తెలుసుకుందాము. ఆయన మక్కా, మదీనాల మధ్యన ప్రయాణం చేస్తూ ఉండేవారు. ఉమ్రాకి వెళ్తూ ఉండేవారు. ఒకసారి ఆయన గారికి ఒక కొండ ప్రాంతంలో గొర్రెల కాపరి కనిపించాడు, చదువుకున్న వ్యక్తి కాదు. నాగరికతకు ఆమడ దూరాన ఉంటూ కొండ ప్రాంతంలో గొర్రెల్ని మేపుతున్నాడు. ఒంటి మీద సరిగా బట్టలు కూడా లేవు. ఈ మహానుభావుడు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ గారు, అతన్ని భోజనానికి పిలిచారు, రా ఎండలో మాడిపోతున్నావు, చాలా శ్రమ పడుతున్నావు. మాతో కాసేపు చెట్టు క్రింద కూర్చొని భోజనం చేయమని చెబితే 'నేను ఉపవాసమున్నాను, పర్వాలేదు, మీరు తినండి' అన్నాడు ఆ వ్యక్తి. అది రమజాన్ నెల కాదు మరి, వేరే నెల. అబ్దుల్లా బిన్ ఉమర్ గారికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. అవాక్కయ్యారు, ఆ గొర్రెల కాపరిని పరీక్షించాలన్న చిలిపి కోరిక కలిగింది. అప్పుడాయన ఈ గొర్రెలెవరివి? అని అడిగితే, ఇవి నావి కావు, నా యజమానివి అన్నాడు ఆ వ్యక్తి. అప్పుడు ఆయన, ఒక గొర్రెను నాకు అమ్మేసేయి. నీకు డబ్బులు ఇస్తాను అన్నారు. ఓ గురువు గారు, ఈ మేకలు నావి కావండీ, నా యజమానివి. దీన్ని వినియోగించే అధికారం నాకు లేదు. నా యజమానికి మాత్రమే ఉంది అన్నాడు. పర్వాలేదు, నేను డబ్బు ఇస్తాను, నీ యజమాని ఒక గొర్రె తక్కువ ఉంది అని అడిగితే తోడేలు తినేసింది అని చెప్పు. ఏమవుతుంది? అని అన్నారు. అప్పుడు ఆ గొర్రెల కాపరికి కోపం వచ్చింది. ఏమంటున్నారు మీరు? మహానుభావులు, నగరాల్లో నివసించేవారు, మా గొర్రెల కాపరుల్ని ఏమనుకుంటున్నారు. నేను దైవానికి భయపడే వ్యక్తిని. నేను నా యజమానికి మోసం చేయగలను కాని ఎవరైతే నన్ను పుట్టించాడో, ఎవరైతే మిమ్మల్ని పుట్టించాడో, ఎవరైతే సమస్త జనులను పుట్టించాడో ఆ సృష్టికర్త ముందు ఏమని సమాధానం చెప్పుకునేది? - అతని మాటలకు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ సంతోషంతోపాటు ఆశ్చర్యానికి గురయ్యారు. నగరానికి వెళ్ళిన తర్వాత ఆ వ్యక్తి గురించి విచారించారు. అతను ఒక బానిస అని, తన యజమాని గొర్రెల్ని మేపుతున్నాడని తెలిసింది. ఆయన అతని యజమాని దగ్గరకు వెళ్ళి "ఈ బానిస ఖరీదు ఎంతో చెప్పండి, నేను అతనికి బానిసత్వం నుండి విడుదల చేసి స్వేచ్ఛను ప్రసాదిస్తాను. అంతేకాదు, ఆ మేకల ఖరీదు ఎంతో చెప్పండి. ఆ మేకలన్నీ నేను అతనికి గిఫ్ట్‌గా బహుమతిగా ఇస్తాను" అన్నారు.

## శ్రేయోభిలాష అంటే ఇదీ!

మిత్రులారా! ఇవి చెప్పటానికి అయితే తీయని పలుకులే. బాగానే ఉంటాయి. కానీ మనం ఆచరణాత్మకంగా, దైనందిన జీవితంలో ఈ భయాన్ని, దైవభీతిని, ఈ జవాబుదారీతనాన్ని, ఈ ఆత్మ విమర్శనను పుణికిపుచ్చుకోవడం ఉంది చూశారు, ఇది కొంచెం కష్టమైన పని, మానవ సముదాయాల్లో ప్రేమానురాగాలు వర్థిల్లాలి అంటే, సౌహార్థం, సామరస్యం విరాజిల్లాలి అంటే తఖ్వా దేనివల్ల జనిస్తుందో దాన్ని మనం నిజాయితీగా అలవరుచుకొని మిగిలిన పదకొండు నెలలు కూడా నీతిమంతులుగా, నిజాయితీ పరులుగా జీవించవలసిన అవసరం ఎంతైనా ఉంది. మనం మన దేశానికి ఉపయోగపడాలి, మన ఉనికి ద్వారా ఇతరులకు మేలు చేకూర్చాలి. గురుజాడ అప్పారావు గారి మాటల్లోనే చెప్పాలంటే, 'దేశాభిమానం నాకు కద్దని వట్టి గొప్పలు చెప్పుకోకోయ్. పూని ఏదైనాను ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్.' కాసేపు మనం రాజకీయాలను మరచిపోయి మూడు దశాబ్దాల వెనక్కి పోదాం....

1991లో భారతదేశం ఆర్థికంగా కృంగిపోయింది. భారతదేశపు బంగారపు నిల్వలు అంతర్జాతీయ ద్రవ్య నిధిలో తాకట్టుపెట్టవలసిన దయనీయమైన పరిస్థితి దాపురించింది. అప్పుడు ఒక వ్యక్తి, ఒక ఆర్థిక వేత్త, కేంద్ర పాలకులకు సలహా ఇచ్చాడు- మీరు ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలనీ, సరళీకృత విధానాన్ని అవలంబించాలనీ, బయటినుంచి వచ్చే దిగుమతులపై నామమాత్రపు సుంకం (టాక్స్) విధించాలని సూచించాడు. స్మగుల్డ్ గూడ్సు అని ఆంక్షలు విధించకండి అన్నాడు. ఆ వ్యక్తి ఎవరో కాదు డాక్టర్ మన్మోహన్‌సింగ్. ఆయన సూచనల్ని పాటించిన భారత ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ కేంద్ర ఆర్థికమంత్రిగా ఆరంగేట్రం చేశారు. ఆనక రెండు సార్లు భారతదేశానికి ప్రధానమంత్రి అయ్యారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారిని భారతదేశ ప్రజలు ఎంత ఘనంగా స్వాగతించారో, తన పరిశోధనలతో భారత రక్షణశాఖకు బలం చేకూర్చిన డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలామ్‌కి కూడా అంతే ఘనంగా బ్రహ్మరథం పట్టారు. వారిద్దరూ మైనార్టీ వర్గానికి చెందినవారే. కాని భారత

దేశపు అత్యున్నత పదవుల్లోకి రావటానికి దోహదపడిన వస్తువు ఏది? వారిలోని ప్రతిభ, వారిలోని శ్రేయోభిలాష, దేశానికి నా వల్ల మేలు జరగాలనేటటువంటి తహతహ వారిని అత్యున్నత స్థానానికి చేర్చింది. ఉపవాసం ద్వారా మనం నేర్చుకోవాల్సింది ఇదే. లేకుంటే మన ఉనికి ద్వారా సమాజానికి, దేశానికి గాని మన కుటుంబానికి గాని, మనల్ని నమ్ముకున్న మన అనుయాయులకి గాని ఎలాంటి మేలు జరగదు. "సొంత లాభం కొంత మానుకుని పొరుగు వాడికి తోడుపడవోయ్. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్."

దేవుడు మనల్ని పుట్టించింది ఎంతసేపూ ఏడుస్తూ కూర్చోవడానికి కాదు, నా హక్కులు నాకు దొరకలేదు అని చెప్పుకుంటూ తిరగడానికి కాదు. నీ బాధ్యతల్ని, నీ కర్తవ్యాన్ని కూడా నిజాయితీగా నెరవేర్చాలి. నీ ఉనికి వల్ల లోకానికి మేలు జరగాలి.

## మానవుడా! నిన్ను నీవు తెలుసుకో!!

మనం మహనీయల చరిత్ర చదవాలి. వారు చెప్పిన మాటల్ని మనం సరిగ్గా గ్రహించాలి. చెడు అనకండి, చెడు వినకండి, చెడు కనకండి అనీ, ఇది బాపూజీ పిలుపు అని కూడా అంటాం. రమజాన్ మాసపు ఉపవాసాలు చెప్పేది కూడా ఇదే. మీరు రోజా ఉంటే మీరు చెడు మాట అనరాదు. మీరు ఉపవాసం ఉంటే చెవితో చెడు వినరాదు. మీరు ఉపవాసం ఉంటే కళ్ళతో చెడును చూడరాదు. చెడు వైపునకు మీరు నడిచిపోరాదు. చెడును మీ చేతులతో చేయరాదు. మీరు నిష్టగా నిజాయితీగా జీవించాలి. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు : "మేము ఆదం పుత్రుడైన మనిషికి గౌరవం వొసగాము" (17: 70) అని. మనిషి మనిషిని గౌరవించడం చాలా చిన్న విషయం. కాని దేవుడు స్వయంగా మనిషిని ఉద్దేశించి 'మేము నీకు గౌరవాన్ని ప్రసాదించాము' అంటున్నాడు. ఎంత పెద్ద బిరుదు ఇది. చాలా పెద్ద బిరుదు. మరోచోట "ఓ మానవులారా! మీరు అనుక్షణం దేవునిపై ఆధారపడి ఉన్న నిర్ధనులు, ఫకీరులు మీరు, మీకు దేవుని అవసరముంది, దైవానికి మీ అవసరం లేదు. ఆయన నిరపేక్షాపరుడు. తనకు తానే స్తవనీయుడు" (35: 15) అని సెలవీయబడింది. భూమ్యాకాశాల ఖజానాలు అన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఒక సంవత్సరం వర్షం పడకపోతే మనం విలవిల్లాడిపోతాం. కరువు కాటకాలు తాండవిస్తాయి. జలాశయాలు ఎండిపోతాయి. మనుషులకు తిండి దొరకదు, పశువులకు గ్రాసం కూడా దొరకదు. దేవుడు కూడా అదే అంటున్నాడు - ఖజానాలు అన్నీ తన అధీనంలోనే ఉన్నాయని. ఆకాశం నుండి వర్షాన్ని కురిపించేవాడు, మృతభూమిని బ్రతికించేవాడు, మొక్కల్ని మొలకెత్తించేవాడు, పంటల్ని పండించేవాడు, మీకు తిండిని ప్రసాదించేవాడు, మీకు అత్యున్నతమైన జీవన సామగ్రిని ప్రసాదించినవాడు ఆ దేవుడు. కనుక మీరు ఆయన్ని నమ్ముకోండి. ఆయన ఏ నియమావళిని అయితే ఇచ్చాడో ఆ నియమావళి ప్రకారం జీవించండి, ఇతరుల హక్కులను కొల్లగొట్టకండి. ఇదీ రమజాన్ మాసపు సందేశం.

ఇంతకుముందు చెప్పినట్లు భారతదేశం రంగురంగుల పూవనం. విభిన్న మతాల వారు ఇక్కడ నివసిస్తున్నారు. కవి ఇక్బాల్ మాటల్లోనే చెప్పాలంటే, "ఏ మతమైనా బోధించదుగా ద్వేషాన్ని, రూపుదిద్దుదాం భిన్నత్వంలో ఏకత్వాన్ని. మానవ నైతిక ప్రమాణ నికషం నా దేశం. విశ్వంలోనే విశిష్టమైనది నా దేశం".

మనం సమయం సందర్భాలను పురస్కరించుకుని ఒకరి భావాలను మరొకరు తెలుసుకోవలసిన అవసరం చాలా వుంది. ఒకరిని ఒకరు అర్థం చేసుకున్నప్పుడే భారతదేశంలో ప్రజా బాహుళ్యం మధ్యన సహిష్ణుతా భావం అంతర్వాహినిలా ప్రవహిస్తుంది.

మిత్రులారా! ఒకరి అభిప్రాయాలు ఇంకొకరికి నచ్చకపోవచ్చు. ఒకరి దృక్పథం ఇంకొకరికి రుచించకపోవచ్చు. అలాగే ఒకరి సిద్ధాంతంతో ఇంకొకరు ఏకీభవించకపోవచ్చు. అయినప్పటికీ ఈ భిన్నాభిప్రాయాలను ఒండొకరు తెలుసుకుని, వాటిని అకామడేట్ చేయటం నేర్చుకోవాలి. ఇది ఈనాటి ఆవశ్యకత. దీనిని నేర్చుకున్నప్పుడే సమాజంలో మంచి అనేది, శాంతి అనేది, సామరస్యమనేది, సౌహార్ధం అనేది వెల్లివిరుస్తుంది.

ఈ శుభ సందర్భంగా నా మనోభావాల అభివ్యక్తికి మహత్తర అవకాశం కల్పించిన పెద్దలందరికీ నిండు హృదయంతో కృతజ్ఞతల్ని తెలుపుకుంటూ ఇంతటితో ముగిస్తున్నాను. ✤



'చరితార్థులు'

# మియాన్ అక్బర్ షాహ్

## (1889-1990)



126

స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో 'ది గ్రేట్ ఎస్కేప్'గా అభివర్ణించబడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'కలకత్తా-బెర్లిన్' సాహస ప్రయాణానికి తోడ్పాటు ఇచ్చిన యోధులు మియాన్ అక్బర్ షాహ్ ప్రస్తుత పాకిస్తాన్‌లోని Khyber-Pakhtunkhwa ప్రాంతానికి చెందిన నౌషేరా జిల్లా బద్రషి (Badrashi) గ్రామాన 1889లో జన్మించారు. ఉన్నత విద్య తరువాత ఆయన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌తో కలసి 'ఖుదా-యే-ఖిద్మత్‌గార్' సంస్థ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించారు. వాయవ్య సరిహద్దు ప్రాంతంలో ఆ సంస్థ విస్తరణకు ఆయన పాటుపడ్డారు. అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్‌తో కలసి పఠాన్ విద్యాభివృద్ధి, ఆ జాతి జనులలో చైతన్యం సంస్కరణకు మియాన్ అక్బర్ షాహ్ ఎనలేని కృషి చేశారు. 1920లో మౌల్వీ అబ్దుల్ బారి ఫిరంగి మహల్ ఇచ్చిన 'హిజ్రత్' (వలస) పిలుపు మేరకు ఇండియా బయట నుండి బ్రిటిషర్ల మీద యుద్ధం సాగించాలన్న లక్ష్యంతో వలస వెళ్ళిన సాహసికులతో కలసి మియాన్ అక్బర్ షాహ్ ఆఫ్ఘనిస్తాన్‌కు హిజ్రత్ చేశారు. ఆఫ్ఘనిస్తాన్ అధినేత అమానుల్లా వారిని తన దేశంలోకి అనుమతించక పోవడంతో అక్బర్ షాహ్ అటునుండి రష్యా వెళ్ళారు. రష్యాలో కమ్యూనిజంను అధ్యయనం చేసి స్వదేశం వచ్చారు. స్వదేశం రాగానే పెషావర్ కుట్ర కేసులో ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టుచేసి మూడేండ్లపాటు జైలుశిక్ష విధించింది. శిక్షాకాలం ముగిశాక ఆయన అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి 1930 న్యాయశాస్త్రంలో పట్టా పొంది పెషావర్ పట్టణంలో న్యాయవాదిగా స్థిరపడ్డారు. ఆ తరువాత వాయవ్య సరిహద్దు ప్రాంతంలో సాగిన స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామిగా, సమసమాజం లక్ష్యంగా ఆయన తన కార్యక్రమాలను పునఃప్రారంభించారు. ఈ క్రమంలో పలుమార్లు ప్రభుత్వ నిర్బంధాలకు, అరెస్టులకు గురయ్యారు. జైలుశిక్షలు అనుభవించారు. 1939లో సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్'లో చేరి ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాయవ్య సరిహద్దు ప్రాంతంలో తన కార్యకలాపాలను ముమ్మరం చేశారు. 1941 జనవరిలో కలకత్తా నుంచి బెర్లిన్‌కు సుభాష్ చంద్రబోస్ సాగించిన 'గ్రేట్ ఎస్కేప్' రూపకల్పన నుండి అమలు వరకు ప్రధాన పాత్ర నిర్వహించారు. సుభాష్ కలకత్తాలోని స్వగృహం నుండి బయలుదేరాక ఆయనను పెషావర్ చేర్చడానికి అవసరమైన ఏర్పాట్లను చేసి బోస్‌ను భద్రంగా ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులను దాటించారు. ఆనాటి సాహసిక చర్యకు ఆగ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వం 1941 ఏప్రిల్ మాసంలో అక్బర్ షాహ్‌ను నిర్బధించి పలు జైళ్ళకు తరలించి, అనేక ఇక్కట్లు పెట్టి చివరకు 1943లో విడుదల చేసింది. ఆ తరువాత స్వస్థలం చేరుకుని స్వేచ్ఛ - సామ్యవాద వ్యవస్థ స్థాపన ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్న అక్బర్ షా వాయవ్య సరిహద్దు ప్రాంతంలో 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్' ప్రధాన నాయకుడిగా నిర్బంధాలు, అరెస్టులు, జైలు శిక్షలు అనుభవిస్తూ ప్రజాపక్షంగా సాగారు. 1951లో ఆయన శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత నౌషేరా ప్రాంత రాజకీయాలకు పరిమితమై, గ్రామ పునఃనిర్మాణ కార్యక్రమాల పట్ల శ్రద్ధచూపుతూ వచ్చిన మియాన్ అక్బర్ షాహ్ 18 ఏప్రిల్ 1990లో కన్నుమూశారు. ✤



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




**సమాజం** ప్రశాంతంగా ఉండటం అనేది చాలా అవసరం. సమాజంలో ఉండే ప్రతి మనిషిపై శాంతిని స్థాపించే బాధ్యత ఉంది. మనిషి గనక ఈ బాధ్యతను నెరవేర్చకపోయినట్లయితే మనిషికీ జంతువుకూ మధ్య ఎటువంటి తేడా ఉండదు. మానవ సమాజం దినదినాభివృద్ధి చెందుతూ ఉండాలి. దానికోసం కొత్త కొత్త విషయాలను వెలికితీస్తూ ఉండాలి. దాని పురోభివృద్ధి కోసం ప్రతిక్షణం పాటుపడుతూ ఉండాలి. దాని ఉపయోగాలను ప్రజలకు చేరువ చేస్తూ అతి తేలికగా వారి అవసరాలను తీరుస్తూ ఉండాలి. అంచెలంచెలుగా జ్ఞానం అభివృద్ధి చెందుతూ ఉండాలి. ఇవన్నీ కార్యరూపం దాల్చాలంటే మానవ సమాజం శాంతి యుతంగా ఉండటం, సుఖసంతోషాలతో ఉండటం, ఆరోగ్య వంతమైన వాతావరణాన్ని కలిగి ఉండటం చాలా అవసరం. మనిషికి ఈ వాతావరణం లభించకపోయినట్లయితే, అశాంతి ప్రబలిపోయి కల్లోలాలు చెలరేగినట్లయితే మనిషి ఆందోళనకు గురవుతాడు. దాని కారణంగా అతనికి లభించిన జ్ఞానం కాస్తా క్రమక్రమంగా క్షీణించిపోతుంది. అభివృద్ధి దశకు పయనించే అతని పయనం కాస్తా మందగించిపోతుంది. అతని హృదయం కాస్తా కల్లోల రహితం కారణంగా కలుషితమైపోతుంది. అతను నిస్సహాయ స్థితికి గురవుతాడు. ఏదో దొరికింది తిని, త్రాగి జీవితం గడిపి వెళ్ళిపోతాడు, సమాజానికి ఏమీ ఇవ్వలేకపోతాడు.

ప్రశాంతమైన వాతావరణానికి ఎంతో ప్రాముఖ్యం ఉన్న కారణం గానే కారుణ్య ప్రభువైన అల్లాహ్ సృష్టి ప్రారంభం నుంచే ప్రవక్తలను పంపి శాంతియుతమైన వాతావరణం స్థాపించటానికి ఏర్పాట్లు చేశాడు. అన్యాయాలు, దౌర్జన్యాలు క్రమక్రమంగా రూపుమాపేలా శాంతియుతంగా ప్రయత్నం చెయ్యాలని, దాని కోసం ప్రజల హృదయాలలో నైతిక విలువలను పెంపొందే ఏర్పాట్లు చెయ్యా లని, ప్రజల హక్కులు ఏమిటో సవివరంగా అందరికీ తెలియజె య్యాలని, దైవ భయాన్ని, పరలోకంలో సమాధానం చెప్పుకోవలసి ఉంటుందనే జవాబుదారీ తనాన్ని హృదయాల్లో నాటే ప్రయత్నం చెయ్యాలని ఆదేశించాడు. ప్రవక్తలందరూ ఆ దైవాజ్ఞల ప్రకారమే ధరణిపై శాంతి స్థాపనకు సహనంతో కృషి చేశారు. చివరకు వారు లక్ష్యాన్ని చేరుకున్నారు. అయితే ప్రవక్తల పరంపర ముగిసిన కారణంగా ఈ బాధ్యత మనందరిపై ఉంది. కాబట్టి దానిని స్థాపించటానికి మనం కూడా కృషి చెయ్యాలి. అన్నింటికంటే ముందు తనను తాను సంబోధించుకోవాలి, సంస్కరించుకోవాలి. ఆ తరువాత తన ఇంటి వారినీ, తన కుటుంబ సభ్యులనూ సంబోధించాలి. అంతేకాదు తన చుట్టూ ఉండే ప్రజలపై కూడా దృష్టిని సారించాలి. ఇదంతా చిత్తశుద్ధితోనూ, ప్రేమానురాగాల తోనూ, పరలోక ప్రతిఫలాపేక్షతోనూ, దైవభయంతోనూ చెయ్యాలి. దైవాజ్ఞలకు లోబడి మరీ చెయ్యాలి.

అల్లాహ్ అమితమైన ప్రేమ గలవాడు, అనంతమైన కరుణా సాగరుడు. తన దాసులను అమితంగా ప్రేమిస్తాడు. ఆయన దృష్టిలో అందరూ సమానులే. ఏ ఒక్క దాసునికి అన్యాయం

జరిగినా ఆయన సహించడు. అతని పట్ల ఆయన పూర్తిగా న్యాయం చేస్తాడు. ఈ విషయాన్ని విశదీకరించటానికి ఆయన దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: ఒక్క మానవుణ్ణి చంపిన వాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక్క మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే (5: 32). ఈ విధంగా అల్లాహ్ మానవ ప్రాణానికి హాని తలపెట్టిన వాడికి శిక్ష ఎంత గంభీరంగా ఉంటుందో, అదేవిధంగా మానవ ప్రాణాన్ని కాపాడినట్లయితే దానికిచ్చే ప్రతిఫలం ఏవిధంగా ఉంటుందో కూడా ఈ వాక్యం ద్వారా అల్లాహ్ స్పష్టంగా తెలియ జేశాడు. అంతేకాదు, తోటి మానవులకు చిన్నపాటి కష్టాన్ని కలిగించినా ఆయన సహించడనే విషయాన్ని కూడా ప్రవక్త(స) గారి ద్వారా తెలియజేశాడు. దైవప్రవక్త(స) ఒకసారి 'దైవసాక్షిగా అతను విశ్వాసి కాడు, దైవసాక్షిగా అతను విశ్వాసి కాడు, దైవసాక్షిగా అతను విశ్వాసి కాడు' అని మూడుసార్లు సెలవిచ్చారు. అక్కడ ఉన్న ఆయన(స) గారి అనుచరులు 'ఓ దైవప్రవక్తా(స)! ఎవరు?' అని విన్నవించుకున్నారు. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు: ఎవరి చేతల వల్ల అతని పొరుగువాడు సురక్షితంగా ఉండడో ఆ వ్యక్తి. (బుఖారీ)

మనిషి ఒంటరిగా జీవించటం అనేది ఎంత మాత్రమూ జరగదు. అతని ప్రక్కన ఎవరో ఒకరు నివసిస్తూనే ఉంటారు. కనుక దేవుడు కోరేదేమిటంటే పొరుగులో ఉన్నవారు ఒకరి ద్వారా ఒకరు సురక్షితంగా, క్షేమంగా, సంతోషంగా ఉంటూ జీవితం గడపాలి. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఉండాలి. కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ ఉండాలి. వారు ఏ మతానికి, ఏ జాతికి, ఏ రాష్ట్రానికి చెందినవారైనా సరే. అల్లాహ్ దృష్టిలో అందరూ సమానులే. అందరూ అన్నాదమ్ముళ్ళు, అక్కాచెల్లెళ్ళ మాదిరిగా కలసి మెలసి ప్రశాంతంగా జీవితం గడపాలి. ఈ విషయాన్ని అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు : మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజిం చాము. తరువాత మీరు ఒకరికొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. (49: 13)

దైవప్రవక్త(స) ప్రవక్త కాక పూర్వం అక్కడి ప్రజలు తన జాతి గొప్పదని, తన వంశం ఉత్తమమైనదనీ గర్వపడేవారు. తన వారిని సంరక్షించుకోవటానికి వారు పూర్తి కృషి చేసేవారు. ఇతరులపై దౌర్జన్యాలు చేసేవారు, అన్యాయాలకు ఒడిగట్టేవారు. ఇతరులను హీనంగా, నీచంగా చూసేవారు. ఒకసారి ఏమి జరిగిందంటే, కాబా గృహ పునః నిర్మాణం జరుగుతూ ఉంది. దాని ఒక గోడలో ప్రత్యేకమైన ఒక రాయి హజ్రె అస్వద్‌ను పెట్టవలసి ఉంది. ఆ విలువైన రాతిని ఎవరు ప్రతిష్టిస్తారనే ప్రశ్న తలెత్తింది. మా వంశం గొప్పది, మా వంశం గొప్పది కాబట్టి మా నాయకుని చేతిలో ప్రతిష్టింపజేస్తామని ప్రతి ఒక్కరు పోటీ పడ్డారు. కాని ఎవరూ ఎవరి నాయకుణ్ణి ఒప్పుకోవటానికి సిద్ధంగా లేరు. గొడవలు ప్రారంభమయ్యాయి. చివరకు దైవప్రవక్త(స) కల్పించుకున్నారు. రేపటి ఉదయం కాబా గృహంలో అందరికంటే ముందు ఎవరు ప్రవేశిస్తారో వారికి ఆ అవకాశం దక్కుతుంది అని ప్రకటించారు. అందరూ ఒప్పుకున్నారు. రెండో రోజు ఉదయం అందరికంటే ముందు ముహమ్మద్(స) కాబా గృహానికి వచ్చారు. అందరూ ఒప్పుకున్నారు. ఆయన(స)కు ఆ అవకాశం లభించింది. కాని ఆయన(స) ఆ అవకాశం లభించిందని విర్రవీగలేదు. ఆ అవకాశాన్ని పూర్తిగా ఒక్కరే ఉపయోగించుకోనూ లేదు. ఒక దుప్పటి తెప్పించారు. ఆ రాయిని ఆ దుప్పటిలో ఉంచారు. ప్రతి వంశ నాయకుణ్ణి పిలిచి ఆ దుప్పటిని పట్టుకుని ఎత్తి కాబా గృహ గోడ వరకు తీసుకురమ్మన్నారు. వారందరూ సంతోషంతో, సద్భావంతో కలసిమెలసి తీసుకువచ్చారు. ఆయన(స) దానిని ప్రతిష్టించారు. ఈ విధంగా ఆయన వివేకంగా ఆలోచించి అందరినీ సంతోషపెట్టారు. జరగబోయే రక్తపాతాన్ని అరికట్టారు.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఓ ప్రజలారా! మీరందరి ప్రభువు ఒక్కడే, తండ్రి ఒక్కడే. తెల్లవానికి నల్లవానిపై గానీ, నల్లవానికి తెల్లవానిపై గాని, అరబ్బేతరునికి అరబ్బుపైగాని, అరబ్బుకు అరబ్బేతరునిపై గానీ ఎలాంటి ఆధిక్యతా లేదు. భయభక్తులు కలవారికి తప్ప. (బుఖారీ). ఈ విధంగా ఆయన(స) తన ఆచరణ లతో, తన ఉపదేశాలతో అందరినీ ఒకే తాటిపై నుంచోబెట్టారు.

ఇంకా ఆయన(స) ఇలా కూడా సెలవిచ్చారు : ఎవడైతే ప్రజలను ప్రేమించడో అల్లాహ్ కూడా అతడిని ప్రేమించడు. ప్రజల పట్ల దయ చూపేవాడిపై అల్లాహ్ కూడా దయ చూపుతాడు. మీరు ధరణిపై ఉన్న వారిపై దయ చూపండి. ఆకాశంపైనున్నవాడు మీపై దయ చూపుతాడు. (తిర్మిజీ)

ఓ ప్రజలారా! నిశ్చయంగా మీ ధన, మాన, ప్రాణాలు పవిత్ర మైనవి, గౌరవప్రదమైనవీను. ఏ విధంగానైతే ఈ దినం, ఈ మాసం, ఈ నగరం పవిత్రమైనదో, గౌరవప్రదమైనదో ఆ విధంగా.

ఇంకా ఆయన(స) క్షమాభిక్ష అనే గుణాన్ని కలిగి ఉన్నారు. ఆయన శత్రువులను సైతం క్షమించి వదిలివేశారు. కనుకనే ఆయన తన ఆచరణలతో అశాంతి ప్రబలిపోయిన ఆ దుర్మార్గపు వాతా వరణాన్ని బహుకొద్ది కాలంలోనే శాంతియుతంగానూ, సౌభాగ్య వంతమైన వాతావరణంగానూ రూపుదిద్దారు.



# పిల్లల్లో పెరిగిన పోషకాహార లోపం

డా॥ ఎన్. ఖలీల్, హైదరాబాద్

ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో నాలుగోవంతు మంది భారత్‌లో ఉన్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు కోట్ల రూపాయలు వెచ్చించారు. లెక్కలేనన్ని పథకాలు ప్రజారోగ్యం కోసం ప్రవేశపెట్టారు. అంతేకాదు పేదలకు పౌష్టికాహారం సమకూర్చే విషయంలో పాలకులు శ్రద్ధ తీసుకుంటున్నా దేశ వ్యాప్తంగా కోట్లాది రూపాయలు వ్యయంచేస్తున్నా ఆశించిన ఫలితాలు లభించలేదనే చెప్పాలి. దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా పేదలు పెరిగిపోతున్నారు. అందుకు కారణాలు, కారకులు ఎవరు అనే విషయం పక్కన పెడితే పౌష్టికాహారం అందించడంలో విఫలమైనారనేది ఐక్యరాజ్యసమితి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

గత రెండేళ్ళుగా కరోనా రక్కసి కారణంగా పేదలు మరింతగా పెరిగిపోయారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు పదిహేను కోట్ల మందికి పైగా అదనంగా పేదరికంలో చేరి ఉంటారని ప్రపంచ బ్యాంకు అంచనా వేస్తున్నది. పదిపన్నెండు కోట్ల మంది ఆకలి కోరల్లో అదనంగా చిక్కుకున్నారని అంచనా. అసలు అందరికి పౌష్టికాహారం లభ్యత అనే సంగతి దేవుడెరుగు, కనీసం మూడు పూటలా సగమైనా ఆహారం దొరకని కోట్లాది మంది ఉన్నారు. ప్రధానంగా ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లల్లో 40% మంది తక్కువ బరువుతో పుడుతున్నారు. వారిలో 7% మంది పిల్లలు పుట్టిన ఐదేళ్ళలోపే మరణిస్తున్నారు. వీరిలో అధికశాతం మంది సరైన పౌష్టికాహార లోపంతో వివిధ వ్యాధుల బారినపడి మరణి స్తున్నారు. పుట్టిన ప్రతి వారికి జీవించేహక్కు రాజ్యాంగం కల్పిం చింది. కానీ ఇలా పౌష్టికాహార లోపంతో పసిపిల్లలు మరణిస్తుంటే అందుకు బాధ్యత వహించాల్సింది పాలకపెద్దలే అనేది కాదనలేని వాస్తవం.

తల్లీబిడ్డకు సకాలంలో పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత విస్మరిస్తున్నారని చెప్పకతప్పదు. ఇందుకు కొత్త పథకాలు ప్రవేశ పెట్టకపోతే పోయారు. ఉన్న పథకాలు ఏ మేరకు అమలు చేస్తు న్నారో ఒక్కసారి పాలక పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ప్రధానంగా నగరాల్లోని మురికివాడల్లో ఉంటున్న కోట్లాది నిరుపేదల పరిస్థితి రానురాను దుర్భరంగా తయారవుతోంది. నీటి, వాయుకాలుష్యాలతో అశుభ్రవాతావరణంతో వ్యాధులు ప్రబలిపోతుండటంతో వారి పిల్లలు బాధితులవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్‌లో నిర్వహించిన అనేక సర్వేలు, అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా కలుషిత నీరువాడి డయేరియా వంటి రోగాలపాలై అసువులు బాస్తున్నారు. పిల్లల్లో పౌష్టికాహారం లేమిని లేకుండా చేయడానికి వారికి బలవంతపు ఆహారం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇంటిగ్రేటెడె చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐ.సి.డి.ఎస్.) లాంటి పథకాల ద్వారా

దేశవ్యాప్తంగా యేటా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. ఇందుకోసం ఖర్చుపెడుతున్న నిధుల్లో నాలుగో వంతు కూడా వారికి చేరడం లేదు. అధికశాతం దళారులు, మరికొందరు అవినీతి అధికారులు తినేస్తున్నారనేది అందరికీ తెలిసిందే. మరొకపక్క ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు తరచుగా అనారోగ్యం పాలవుతున్నారు. ఇందుకు కూడా పాలకుల నిర్లక్ష్యమే కారణం. దేశ వ్యాప్తంగా మూడో వంతు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. ఉన్నవాటిలో చాలా వరకు అశుభ్రంగా ఉన్నాయి. ఇక శిశు సమగ్ర అభివృద్ధి పథకం కింద మాతా శిశుసంరక్షణ కోసం అందించే పౌష్టికాహారంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. అంగన్వాడీ కేంద్రాలు సేవలందించడం లేదని చెప్పడం లేదు కానీ ఆశించిన మేరకు ఫలితాలు అందించలేక పోతున్నాయి. ఈ విషయంలో గతంలో ఎన్నో సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఆ నివేదికలను పట్టించుకొని పరిశీలించి లోటుపాట్లను సరిదిద్ది మరింత సమర్థవంతంగా అమలుచేసే ప్రయత్నం చేయకపోవడం దురదృష్టకరం.

సరైన పోషకాలు అందకపోతే పసిపిల్లల్లో ఎదుగుదల తగ్గిపోతున్నది. పుట్టిన తరువాత పిల్లలకు తల్లి పాలు శ్రేష్ఠమనే విషయం డాక్టర్లు చెపుతూనే ఉంటారు. మాతృస్తన్యం ద్వారానే పౌష్టికాహారం అందుతుంది. కానీ ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో వైద్యశాఖ అంత చొరవ చూపడం లేదు. తల్లి పాల ప్రాధాన్యతను తెలియచెప్పడానికి ప్రతి యేడాది ఆగస్టు మొదటివారం తల్లి పాల వారోత్సవాలు జరుపుతున్నారు. శిశువు ఆరోగ్యంగా పెరగాలంటే తల్లి పాలు ఎంతో ముఖ్యం. తల్లిపాలు ప్రకృతి ప్రసాదం. దివ్యౌషదం. బిడ్డ వచ్చే సమయానికి తల్లికి పాలు ఉత్పత్తి కావాలి. అందుకు తగిన ఆహారం ఆ తల్లికి అందించాలి. అక్కడే లోపం జరుగుతున్నది. శిశువుకు తల్లిపాలే సరైన ఆహారం అని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి. అయినా ప్రజలకు అవగాహన కల్పించడంలో వెనుకబడే ఉన్నాము. ఇక అంగన్వాడీల నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నది. పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్నది. కొన్ని కేంద్రాలకు స్వంత భవనాలు లేవు. మొత్తం మీద పసిపిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో విఫలమవుతుం డడంతో మరణాల సంఖ్య కూడా పెరిగిపోతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి వెయ్యి మంది గర్భిణీల్లో నూటనలభై మందికిపైగా మరణిస్తున్నారు. ఇదేకాదు భారత్‌లో ఆహార భద్రత కోసం ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (2005)ను అమలు చేస్తున్నారు. ఈ చట్టం కింద భారత ఆహార భద్రత - ప్రమాణాల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసారు. ఆహారభద్రత విషయంలో ఇలాంటి చట్టాలు, సంస్థలు ఏర్పాటు చేసి మరెన్నో చర్యలు తీసుకుంటున్నా ఆచరణకు వచ్చేసరికి తీసుకోవాల్సిన శ్రద్ధ తీసుకోవడం లేదు. దీంతో పథకాలన్నీ చాలా వరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి.

## యాంటీ ఇస్లామోఫోబియా చట్టం చేయాలి




**హిందూ ధర్మం** ప్రమాదంలో ఉందని అంటాడో కాషాయ పార్టీ పెద్ద. లవ్ జిహాద్‌తో హిందూ అమ్మాయిలను పెళ్లిచేసుకుని మతమార్పిడి జరుగుతోందని చెబుతోంది ఓ మీడియా సంస్థ. హిజాబ్, లౌడ్ స్పీకర్లు ప్రమాదంగా భావించి వాటిని బ్యాన్ చేయాలని అంటాడు మరో బీజేపీ నేత. ఈ దేశంలో ఉండాలంటే బీఫ్ మానేయాల్సిందేనంటాడు మరో లీడర్. మూక హత్యలు, బుల్డోజర్ సంస్కృతి, ట్రిబుల్ తలాక్‌పై నిషేధం, యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు ఇవన్నీ ఇస్లామోఫోబియాను సృష్టిస్తున్నాయి. ఇస్లామ్, ముస్లిముల పట్ల శతృత్వాన్ని పెంచే ఇస్లామోఫోబియాను వ్యతిరేకించేందుకు కేరళలో సాలిడారిటీ సంస్థ సమావేశం ఏర్పరిచింది. ఇస్లామ్ చిహ్నాలను కించపరచడం, ముస్లిముల పట్ల విద్వేషాన్ని వెళ్లగక్కడం ఇస్లామోఫోబియాలో భాగమే. ఇస్లామ్ మత వ్యవహారాలపై అపార్థాలు సృష్టించి దుష్ప్రచారం చేయడం వేగంగా జరుగుతోంది. ఇస్లామ్ ధర్మం మీద విషం చిమ్మే సంస్కృతి గత ఎనిమిదేళ్లలో మరింత ఎక్కువయ్యింది. ఇస్లామ్ పట్ల సరైన అవగాహన లేకుండా మీడియా సైతం కథనాలను ప్రచారం చేస్తోంది. వీటన్నింటినీ ఎండగడుతూ కేరళలోని త్రివేండ్రంలో సాలిడారిటీ యూత్ సంస్థ ఆధ్వర్యంలో యాంటీ ఇస్లామోఫోబియా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి మలిక్ మోతసిమ్ ఖాన్ హాజరయ్యారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

85 ఆయత్‌లు

# 40. అల్ మూ'మిన్

మక్కా అవతరణ

28 – 29 ... ఆ సందర్భంలో ఫిర్ఔన్ ప్రజల్లోని ఒక విశ్వాసి, తన విశ్వాసాన్ని మరుగుపరచి ఉంచుకున్న వ్యక్తి, ఎలుగెత్తి పలికాడు: "మీరు ఒక వ్యక్తిని, అతను నా ప్రభువు అల్లాహ్ మాత్రమే అని అన్నంత మాత్రాన చంపివేస్తారా? నిజానికి అతను మీ ప్రభువు వద్ద నుంచి ప్రకాశమానమయిన వాటిని మీ వద్దకు తీసుకువచ్చాడు; ఒకవేళ అతను అబద్ధం పలుకుతున్నట్లయితే అతని అబద్ధం స్వయంగా అతనిపైనే తిరగబడుతుంది. కాని ఒకవేళ అతను నిజం పలుకుతున్నట్లయితే, అతను ఏ భయంకరమయిన పరిణామాలను గురించి మిమ్మల్ని భయపెడుతున్నాడో వాటిలో కొన్నయితే మీపైన తప్పక తారసిల్లుతాయి. హద్దులు మీరిపోయే ఏ వ్యక్తికీ, మొండి అబద్ధాలకోరుకూ[47] అల్లాహ్ సన్మార్గం చూపనేరడు. నా జాతి జనులారా, మీకు రాజసత్తా ప్రాప్తమయి ఉంది, నేడు మీరే భువిలో ఆధిక్యత గలవారు, కాని ఒకవేళ దేవుని అభిశాపం మనకు దాపురిస్తే మరి మనల్ని ఆదుకోగల వాడెవడున్నాడు?"[48]

... 29 ఫిర్ఔన్ ఇలా పలికాడు : "నేనయితే నాకు సముచితమనిపించిన సలహానే మీకు ఇస్తున్నాను మరి సరయిన మార్గం వైపునకే మీకు నేను నిర్దేశన చేస్తున్నాను."[49]

30 – 31 విశ్వాసం గైకొన్న ఆ వ్యక్తి ఇలా అన్నాడు, "నా జాతివారలారా, నాకు భయం కలుగుతోంది, లోగడ అనేక వర్గాలకు దాపురించిన దినమే మీకూ దాపురిస్తుందో ఏమోనని; నూహ్ జాతికి, ఆద్, సమూద్, వాటి తరువాతి జాతులకు ఆసన్నమయినటువంటి దినం. మరి ఇది మటుకు వాస్తవం, అల్లాహ్‌కు తన దాసులపైన ఎటువంటి అత్యాచారం జరిపే ఉద్దేశమూ లేదు.[50]

47. ఈ వాక్యానికి రెండు అర్థాలు సాధ్యం. బహుశా ఫిర్ఔన్ జాతి విశ్వాసి ఈ ద్వంద్వార్థ మాటను ఇచ్ఛాపూర్వకంగానే చెప్పి ఉంటాడు. అప్పటికి ఇంకా తాను బయటపడి తన అభిప్రాయాలను వ్యక్తం చేయదలచి ఉండడు. ఆ మాటకు ఒక అర్థం, ఒకే వ్యక్తి వ్యక్తిత్వంలో రుజువర్తనం వంటి మంచితనం, అసత్యవాదం వంటి చెడుగు ఏకత్రం కాజాలవు. మీరు స్పష్టంగానే చూస్తున్నారు, మూసా చాలా పరిశుద్ధ చరితుడు, ఉత్కృష్టమయిన ఉన్నత శీల స్వభావాలు గల మనిషి. అలాంటప్పుడు అతను ఒక ప్రక్కన, ఇంతటి పచ్చి అబద్ధాన్ని పలికి అల్లాహ్ పేరు చెప్పి దైవదౌత్య నిరాధార మయిన వాదన చేయడం, మరోవైపున అల్లాహ్ ఇతనికి ఇంతటి ఉన్నతశ్రేణి నైతికత ప్రదానం చెయ్యడం సాధ్యమన్న విషయం మీకు ఎలా మింగుడుపడుతోంది? మరో అర్థం ఏమిటంటే, మీరు ఒకవేళ అన్ని హద్దుల్ని అతిక్రమించి మూసా ప్రాణాలకే ముప్పు తెచ్చినట్లయితే అతనిపైన అబద్ధపు ఆరోపణలు మోపి మీ అశుద్ధ పథకాన్ని అమలుపరచినట్ల యితే, బాగా గుర్తుంచుకోండి, అల్లాహ్ మీకు ఎట్టి పరిస్థితి లోనూ విజయపథం చూపడు.

48. అంటే, అల్లాహ్ ప్రసాదించిన ఈ ఆధిక్యత, అధికార వర ప్రసాదం పట్ల కృతఘ్నతా భావం చూపి ఆయన ఆగ్రహాన్ని ఎందుకు కొనితెచ్చుకుంటున్నారు?

49. ఫిర్ఔన్ ఇచ్చిన ఈ బదులునుబట్టి ద్యోతకమయ్యేదేమి టంటే, తన సభకు చెందిన ఈ నాయకుడు విశ్వాసం గ్రహించాడన్న మర్మం ఇంకా అతను గుర్తించలేకపోయాడు. అందువల్లనే అతని మాటకు ఎటువంటి అయిష్టాన్నయితే వ్యక్తం చేయలేదు, కాని తాను అతని అభిప్రాయాలు విన్నప్పటికీ తన అభిప్రాయాన్ని మార్చుకునేందుకు సిద్ధంగా లేదని మాత్రం విశదపరిచాడు.

50. అంటే, అల్లాహ్‌కు తన దాసులయిన మానవులంటే ఎటువంటి శత్రుత్వం లేదు, ఆయన వారిని అనవసరంగా సంహరించడానికి. ఆయన తన శిక్షను పంపడం అన్నది, వారు తమ పరిధులన్నింటినీ అతిక్రమించినప్పుడే జరుగు తుంది. అప్పుడు వారి మీదికి శిక్ష పంపడం అన్నది సరయిన న్యాయం దృష్ట్యా సముచితమయినది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

# ముకాతబత్* ప్రకరణం

## అధ్యాయం : 1

## తన బానిస స్త్రీపై వ్యభిచార అపనిందను మోపినందుకు చుట్టుకునే పాపం

సూరయె నూర్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీ అధీనంలో ఉన్న వారిలో ఎవరైనా 'ముకాతబత్' (షరతుల పత్రం) కొరకు విజ్ఞప్తి చేస్తే, వారిలో మంచితనం ఉందని మీరు గ్రహిస్తే, వారితో 'ముకాతబత్'ను కుదుర్చుకోండి. అల్లాహ్ మీకు ఇచ్చిన ధనం నుండి మీరు వారికి ఇవ్వండి" (24: 33). రూహ్ బిన్ ఉబాదా ఇబ్నె జురైజ్ (రహ్మ) ఆధారంగా ఇలా వివరించారు – నేను అతా బిన్ అబీ రబాహ్‌ను, "నా బానిస దగ్గర సొమ్ము ఉందని, అతను నాతో 'ముకాతబత్' చేసుకోగోరుతున్నాడని నాకనిపించినప్పుడు, నేను అందుకు అంగీకరించటం తప్పనిసరా?" అని అడిగితే, 'తప్పనిసరి అనే నేను భావిస్తున్నాను' అని ఆయన సమాధానమిచ్చారు. అమ్ర్ బిన్ దీనార్ ఇలా అంటున్నారు: "మీరు ఈ వ్యవహారంలో ఏ ఉల్లేఖనమైనా వినిపించగలరా?" అని నేను అతాను అడిగితే, 'లేదు' అని ఆయన బదులిచ్చారు. (తరువాత ఆయనకు జ్ఞప్తికి వచ్చింది) ఆయన నాకు సమాచారం అందిస్తూ, మూసా బిన్ అనస్ ఈ విషయమై తనకు చెప్పారని అన్నారు. ఇంతకీ ఆ సమాచారం ఏమిటంటే, సీరీన్ (ఇబ్నె సీరీన్ తండ్రి) హజ్రత్ అనస్(రజి)కు 'ముకాతబత్' కొరకు విజ్ఞప్తి చేశారు. (ఈయన అనస్ గారి బానిస) ఈయన ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నారు. కాని హజ్రత్ అనస్ 'ముకాతబత్'కు అంగీకరించలేదు. అప్పుడు సీరీన్ హజ్రత్ ఉమర్(రజి) దగ్గరకు వెళ్ళి జరిగినదంతా చెప్పుకున్నారు. హజ్రత్ ఉమర్ (అనస్‌ను పిలిపించి) ముకాతబత్ చేసుకొమ్మని సలహా ఇచ్చారు. అయినప్పటికీ హజ్రత్ అనస్(రజి) ఒప్పుకోలేదు. అందువల్ల హజ్రత్ ఉమర్(రజి) ఆయనకు కొరడా దెబ్బలు కొడుతూ "బానిసలలో మంచితనం ఉందని మీరు గ్రహిస్తే వారితో ముకాతబత్‌ను కుదుర్చుకోండి" (24: 33) అన్న ఆయత్‌ను పఠించారు. ఎట్టకేలకు హజ్రత్ అనస్(రజి) తన బానిసతో వ్రాతపూర్వక ఒప్పందం చేసుకున్నారు.

(మరొక సంఘటన) ఉర్వా కథనం ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: బానిస స్త్రీ అయిన బరీరా (ర.అ) నా వద్దకు వచ్చి, తాను తన యజమానులతో చేసుకున్న 'ముకాతబత్' (లిఖితపూర్వక ఒప్పందం) లో తనకు సహాయపడ మని విన్నవించుకుంది – బరీరా (ర.అ) అయిదు ఊఖియాల వెండిని ఐదేండ్ల లోపు, అయిదు వాయిదాల పద్ధతిపై చెల్లించాల్సి ఉంది– ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ఈ వ్యవహారంలో బరీరా (ర.అ)కు తోడ్పడాలని నాకనిపించింది. "నేను గనక ఆ సొమ్మును (అయిదు ఊఖియాల వెండిని) ఒకేసారి చెల్లిస్తే, వాళ్ళు నిన్ను నాకు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నారా? వారు దీనికి అంగీకరించేటట్లయితే, అప్పుడు నేను నీకు స్వేచ్ఛను ప్రసాదిస్తాను. అయితే నీ 'వలా' (ఆస్తిపాస్తులు) మాత్రం నాకు సంక్రమించాలి" అని చెప్పాను. బరీరా తన యజమానుల దగ్గరకు వెళ్ళి ఈ ప్రతిపాదన చేసింది. 'వలా' హక్కు మాకు సంక్రమించే మాటైతేనే మేము నిన్ను బానిసత్వం నుండి విడుదల చేయగలం అని ఆమె యజమానులు నిర్ద్వంద్వంగా చెప్పారు. హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా అన్నారు: అప్పుడు నేను దైవప్రవక్త (సఅసం)ను ఈ విషయమై సంప్రతించాను. ఆయన(స) "నువ్వు బరీరా (ర.అ)ను కొనుగోలు చేసి, ఆ తరువాత ఆమెకు స్వాతంత్ర్యం ప్రసాదించు. స్వాతంత్ర్యం ఇచ్చినవారికే 'వలా' హక్కు చెందుతుంది" అని అన్నారు. పిదప దైవప్రవక్త(సఅసం) లేచి,

జనులనుద్దేశించి ఇలా ప్రసంగించారు: "జనులలో కొంతమందికి ఏమైపోయింది? వాళ్ళు (వ్యవహారాలలో) ఎందుకు ఇలాంటి అడ్డగోలు షరతులు విధిస్తున్నారు? దైవగ్రంథంలో వాటికి ఎలాంటి ప్రాతిపదిక లేదు. దైవగ్రంథంలో లేని షరతులను ఎవరయినా విధిస్తే అది శుద్ధ తప్పు. దేవుడు విధించిన షరతు మాత్రమే సత్యమైనది, సుదృఢమైనది."[1]

## అధ్యాయం : 2

## ముకాతబ్‌కు ఎలాంటి షరతులు విధించాలి? దైవగ్రంథంలో లేని షరతులను ఎవరయినా విధిస్తే (అవి చెల్లుతాయా)?

**735) హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పినట్లు ఉర్వా తెలిపారు: బరీరా(ర.అ) ఆమె గారి వద్దకు వచ్చి, తన 'ముకాతబత్' వ్యవహారంలో తోడ్పడమని అభ్యర్థించింది. అప్పటికి ఆమె ఏమీ చెల్లించలేదు. హజ్రత్ ఆయిషా(ర.అ) బరీరాతో ఇలా అన్నారు: "నీవు నీ యజమానుల దగ్గరకు వెళ్ళు. నీవు చేసుకున్న ఒప్పందానికి సంబంధించిన సొమ్మంతా చెల్లించే బాధ్యత నాది. అయితే నీ 'వలా' (బంధుత్వ, వారసత్వ) హక్కు నాకు దక్కాలి. దీనికి వారు అంగీకరించినట్లయితే నిన్ను కొనుగోలు చేసి, బానిసత్వం నుండి విడుదల చేస్తాను." బరీరా (ర.అ) తన యజమానులకు పరిస్థితుల ఈ స్వరూపాన్ని క్షుణ్ణంగా వివరించింది. కాని ఆమె యజమానులు ససేమిరా అన్నారు. పైగా వారిలా అన్నారు: 'ఆమె గారు(ఆయిషా-ర.అ) పుణ్యాన్ని ఆర్జించే ఉద్దేశంతో నీ పట్ల సద్వ్యవహారం చేయదలిస్తే చేయవచ్చు. కాని నీ 'వలా' హక్కు మాత్రం మాకే ఉంటుంది. ఈ విషయాన్ని హజ్రత్ ఆయిషా (ర.అ) దైవప్రవక్త(స)కు చెప్పినప్పుడు, ఆయన (స) ఇలా అన్నారు : "(ఆయిషా!) నువ్వు ఆమెను కొనుగోలు చేసి, బానిసత్వం నుండి విముక్తిని వొసగు. విముక్తిని వొసగినవారిదే వలా హక్కు." ఉల్లేఖకులు ఇలా అన్నారు: పిదప దైవప్రవక్త(స) లేచి, జనులనుద్దేశించి ఉపన్యసించారు. ఇలా అన్నారు: "కొంత మందికి ఏమైపోయింది? వారు దైవగ్రంథంలో లేని షరతులు విధిస్తున్నారేమిటి? ఎవరయినా దైవగ్రంథంలో లేని షరతులు గనక విధిస్తే, అలాంటి షరతులు విధించటం వారికి ఎంతమాత్రం తగదు. అలాంటి షరతులు వంద విధించినా అవి చెల్లనేరవు. అల్లాహ్ విధించిన షరతు మాత్రమే అన్నింటికన్నా సముచితమైనది, పటిష్టమైనదీను."[1]**

★ బానిసల విమోచనానికి సంబంధించిన చాలా ముఖ్యమైన పారిభాషిక పదం **'ముకాతబత్'**. అంటే బానిస లేక బానిస స్త్రీ తన యజమానితో చేసుకునే వ్రాతపూర్వక ఒప్పందమిది. నాకు ఇంత వ్యవధిలో ఇంత పైకం, ఇన్ని వాయిదాల్లో చెల్లించి నట్లయితే నీకు స్వేచ్ఛనిస్తానని యజమాని తన బానిస (లేక బానిస స్త్రీ)తో అంటాడు. దీనికి సంబంధించిన షరతులన్నీ లిఖిత పూర్వకంగా ఉంటాయి. ఇస్లామీయ చరిత్రలో మొట్టమొదటి 'ముకాతబత్' చేసుకున్న బానిస హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి). స్త్రీలలో మొట్టమొదటి 'ముకాతబ్' హజ్రత్ బరీరా (ర.అ).

1-1. ఈ అధ్యాయం క్రింద ఇమామ్ బుఖారీ (రహ్మ) హదీసు ఏదీ పొందుపరచలేదు. అయితే రెండు సంఘటనలను మాత్రం ప్రస్తావించారు. బహుశా ఆయన గారికి ఈ అధ్యాయంలోని మకుటంతో పొసగే హదీసును పొందుపరచే వీలు చిక్కలేదేమో! అయితే ఆయన గారు 'కితాబుల్ హుదూద్' (శిక్షల ప్రకరణం)లో ఒక హదీసును తీసుకున్నారు. తన యాజమాన్యంలో ఉన్న బానిస లేక బానిస స్త్రీపై వ్యభిచారపు అపనిందను మోపినవానికి ప్రళయదినాన కొరడా దెబ్బలు కొట్టబడతాయన్నది ఆ హదీసు సారాంశం.

ఇక బానిసగానీ, బానిస స్త్రీ గానీ తమ యజమానుల ఊడిగం నుండి విముక్తి పొందాలని భావించి, 'ముకాతబత్' వ్యవహారం చేసుకోదలిస్తే, యజమానులు వారిలోని సామర్థ్యాన్ని, మంచి తనాన్ని చూడాలి. వారు తమ యజమానితో చేసుకున్న ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించగలరనుకుంటే, వారి ప్రతిపాదనను ఆమోదించాలి. అంతేకాదు, డబ్బు చెల్లించే విషయంలో వారికి సహాయపడాలి కూడా. అమ్మ ఆయిషా (ర.అ) గారు బరీరా (ర.అ)ను బానిసత్వం నుండి విడుదల చేయడానికి చూపించిన శ్రద్ధాసక్తులు, ఔదార్యం అందరికీ ఆదర్శప్రాయం.

ఇకపోతే అనస్ బిన్ మాలిక్ (రజి); ఈయన ఖజ్రజ్ తెగకు చెందినవారు. ఈయన తల్లి పేరు ఉమ్మె సులైమ్. ఈయన దైవప్రవక్త (స) ప్రత్యేక సేవకులు. దైవప్రవక్త(స) మదీనాకు హిజ్రత్ చేసి వచ్చేనాటికి ఈయన పదేండ్ల అబ్బాయి. హిజ్రీ 91 వరకూ 'బస్రా'లో ధార్మిక విద్య బోధించారు. దాదాపు నూరేళ్ళు జీవించారు. ఈయన సంతానం సంఖ్య కూడా దాదాపు 100 వరకు ఉంది. ఈయనగారి హదీసులను చాలామంది ఉటంకించారు.

735-1. దైవగ్రంథంలో లేని షరతులను ఎవరయినా విధిస్తే అలా విధించటం అధర్మమని ఇబ్నె ఖుజైమా అభిప్రాయపడ్డారు.




**- ముహమ్మద్ ముజాహిద్**

భాషకు మతానికి సంబంధంలేదని నిరూపించాడో భాషాభిమాని. భాష పట్ల ప్రేమ అతన్ని ఏకంగా డాక్టరేట్ సాధించేలా చేసింది. అమర్‌నాథ్ ఉర్దూ భాషాభిమాని. ఇటీవలె ఆయన మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్శిటీలో ఉర్దూలో పీహెచ్డీ పట్టా పొంది అందరి మన్ననల్ని అందుకుంటున్నారు. 'ఆజాదీ కే బాద్ ఉర్దూ అఫ్సానా కా తన్‌ఖీదీ తజ్‌జియా' "స్వాతంత్ర్యం తర్వాత ఉర్దూ కథలు – విమర్శనాత్మక విశ్లేషణ" అంశంపై చేసిన 300 పేజీల పరిశోధనకు గాను మౌలానా ఆజాద్ యూనివర్శిటీ అతనికి డాక్టరేట్ అందించింది. ప్రొఫెసర్ నశీరుద్దీన్ ఫరీస్ పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన జరిపారు. అమర్ నాథ్ మానూలో ఎమ్మే ఉర్దూ, ఫారశీ భాషల్లో డిప్లొమా చేశారు. ఢిల్లీ యూనిర్శిటీ నుంచి ఉర్దూ డిప్లొమా చేశారు. ఢిల్లీ యూనివర్శిటీ యూజీసీ నెట్ ఎగ్జామ్ కూడా పాసయ్యారు. ఈయన రాసిన వ్యాసాలు యూజీసీ కెరీర్‌లో అచ్చయ్యాయి. అమర్ నాథ్ పలు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని ఉర్దూలో ఉపన్యాసాలు చేశారు. అమర్‌నాథ్ తన తండ్రి హిరాలాల్ ద్వారా ఉర్దూ భాషను ఒంటపట్టించుకున్నారు. 50 మంది ఉర్దూ కథకులను అమర్ నాథ్ అధ్యయనం చేశారు. డాక్టర్ అమర్ నాథ్ తన పేరు చివరన 'రాహె గీర్' అని చేర్చుకుని ఉర్దూ పట్ల తన మమకారాన్ని చాటుకుంటారు. ఉర్దూ భాషను ఏ ఒక్క మతానికో ముడిపెట్టడం సరికాదు, భాషకు మతమంటూ లేదని అమర్ నాథ్ నిరూపించాడు.. "యూనివర్శిటీలో పనిచేసే ఉర్దూ ప్రొఫెసర్లు ఎంతో మంది వేరే మతానికి చెందినవారున్నారు. వారంతా ఉర్దూలో బోధన చేస్తున్నారు. ఉర్దూ యూనివర్శిటీ తలుపులు అందరి కోసం తెరిచే ఉంటాయి' అని మానూ వైస్ ఛాన్సలర్ సయ్యద్ ఐనుల్ హసన్ అంటారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్‌నాథ్‌ను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. డాక్టరేట్ సాధించడం పట్ల ప్రొఫెసర్ నశీరుద్దీన్ ఫరీస్ హర్షం వ్యక్తం చేశారు.

"మా తాత, నాన్న తరుచూ ఉర్దూ మాట్లాడేవారు. ఉర్దూ భాషంటే వారిద్దరికీ ప్రాణం. వాళ్లతో ఉర్దూలో మాట్లాడే ప్రయత్నం చేసే వాడిని. అలా ఉర్దూ భాషపై పట్టు సాధించాను. నాన్నగారు రాసే ఉర్దూ డైరీ తరుచుగా చదివేవాడిని. ఉర్దూ భాషపై ఆయన కున్న అపారమైన ప్రేమ నన్నెంతగానో ప్రభావితం చేసింది. ఉర్దూలో డాక్టర్ సాధించడం గర్వంగా ఉంది."అని తన ఉర్దూ ప్రయాణాన్ని మీడియాతో పంచుకున్నారు అమర్ నాథ్. బీఎస్సీ చదువుతున్న అమర్‌నాథ్ కూతురు కూడా ఉర్దూ చదవడం, రాయడం నేర్చుకుంటోంది.

"ఉర్దూ విశ్వవిద్యాలయం గంగా–జమునా నాగరికతకు ప్రతీక, ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరుగుతుంది. నేను ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు మారాను, కానీ కొత్త ప్రదేశానికి వచ్చినట్లు ఎప్పుడూ అనిపించలేదు" అని అమర్ నాథ్ అన్నారు. ఉర్దూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు సాధించి, ఉర్దూ భాషకు సేవచేయడమే తన లక్ష్యమని చెప్పిన డాక్టర్ అమర్ నాథ్ ఆశయం నెరవేరాలని ఆశిద్దాం. ✤




# మేరాజ్- ఆరోహణం

- ఎస్.ఎమ్. మలిక్

**మక్కాలోను,** మక్కా పరిసర ప్రాంతాల్లోనూ ఇస్లామ్ సందేశం చేరిపోయింది. దైవం ఎవరెవరికి సద్బుద్ధిని ప్రసాదించాడో వారంతా దైవధర్మంలోకి ప్రవేశించి తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. మక్కా పరిసరాలేకాక దూరదూర ప్రాంతాల వారికి కూడా ఇస్లామ్ సందేశాన్ని వినే భాగ్యం కలిగింది. వారు దాన్ని స్వీకరించి ధన్యులూ అయ్యారు. తమ జీవితాలను దైవవిధేయతా మార్గాన చక్క దిద్దుకోవడంలో నిమగ్నులూ అయ్యారు.

### యస్రిబ్‌లో ఇస్లామ్

దైవదౌత్యం తరువాత 11వ సంవత్సరం హజ్జ్ కాలంలో దైవ సందేశ హరులు ముహమ్మద్(స) అరబ్బు తెగలలో సందేశాన్ని అందజేయ డానికి తన మామూలు ప్రకారం మినా మైదానం వైపునకు బయలుదేరారు. అక్కడ ఓ కొండ కనుమ వద్ద యస్రిబ్ (మదీనా)కు చెందిన ఓ తెగ ఖజ్రజ్‌ని కలిశారు. వారు ఆరుగురు. వారిని ఓ చోట కూచోబెట్టి ప్రవక్తశ్రీ వారికి ఇస్లామ్ బోధనలు తెలిపారు, కుర్ఆన్ వినిపించారు. ఖజ్రజ్ తెగవారు, ''సోదరులారా, మన పొరుగు వారయిన యూదులు ఏ ప్రవక్త రానున్నారని మమ్మల్ని మాటి మాటికి హెచ్చరిస్తూ ఉంటారో, ఈయనే ఆ ప్రవక్త! యూదులు మీకన్నా ముందు ఈయన్ని స్వీకరించడం జరగరాదు, జాగ్రత్త!!'' అనుకుంటూ చాలా సంతృప్తికరంగా ఇస్లామ్ స్వీకరించారు. ఆపైన తాము యస్రిబ్ వెళ్ళి తమ సోదరులకూ ఈ సందేశాన్ని అందజేస్తామని, ఈ సందేశం, దైవప్రవక్త వల్ల తాము లోనయి ఉన్న అంతర్యుద్ధం సమసిపోగలదేమో అన్న ఆశాభావం వెలిబుచ్చి, మరుసటి సంవత్సరమూ తాము వస్తామని చెప్పారు. వారు వెళ్ళి యస్రిబ్‌లో ప్రతి తెగలోనూ ప్రతి వీధిలోనూ ప్రవక్తశ్రీ(స) బోధనలు, ఇస్లామ్ సందేశాన్ని బాగా ప్రచారం చేశారు.

మరుసటి సంవత్సరం, అంటే దైవదౌత్యం 12వ సంవత్సరం యస్రిబ్ నుండి 12 మంది వచ్చారు. వారిలో గత సంవత్సరం వచ్చిన వారిలో అయిదుగురితోపాటు ఇద్దరు ఔస్ తెగకు చెందిన వారు, 5 గురు ఖజ్రజ్‌కు చెందినవారు ఉన్నారు. ఈ సంవత్సరం కూడా వారు ప్రవక్త మహనీయులతో కలసి ప్రమాణబద్ధుల య్యారు. మహనీయ ముస్అబ్ బిన్ ఉమైర్(ర)ని వారికి తోడుగా పంపారు ప్రవక్తశ్రీ(స). మహనీయ ముస్అబ్‌కు యస్రిబ్‌లో ఇస్లామీయ సందేశ ప్రచారోద్యమం నిర్వహించడంతోపాటు ఇస్లామ్ స్వీకరించినవారికి ఇస్లామ్ బోధనలు నేర్పడం, కుర్ఆన్‌ని

బోధించడం, వారి శిక్షణ ఇత్యాది ధార్మిక విధులు నిర్వహించే బాధ్యత అప్పగించడం జరిగింది. యస్రిబ్‌లో మహనీయ ముస్అబ్ తన విధుల్ని మా చక్కగా నిర్వహించారు, ఫలితంగా అక్కడ ముస్లిముల చెప్పుకోదగ్గ వర్గం లేని ఒక్క వీధీ లేకుండా తయారయింది. ఆ తరువాతి సంవత్సరం అంటే దైవదౌత్యం 13వ సంవత్సరం 75 మంది హజ్జ్‌కు వెళ్ళారు యస్రిబ్ నుండి. అప్పుడు అదే కొండ కనుమ దాపున యస్రిబ్ వారితో సంభాషణ జరిగింది. సంభాషణ, ప్రవక్త పక్షాన మహనీయ అబ్బాస్ ప్రారంభించారు. ఆయన, "ప్రవక్తశ్రీ(స) తన దౌత్య కార్యనిర్వహణ పరిపూర్తి కొరకు బలమయిన కేంద్రంగా యస్రిబ్‌ని ఎన్నుకున్నారు. ఆయన్ని విరోధుల బారి నుండి రక్షించే బాధ్యత తీసుకున్నట్లయితే ఆయన మీ నగరానికి వస్తారు" అని సవివరంగా చెప్పారు. అప్పుడు యస్రిబ్ వారు, "మీ మాటల్ని విన్నాము, ఇక ప్రవక్తశ్రీ(స) ద్వారా వినదలిచాము, ప్రవక్తా మీరు చెప్పండి, మా నుండి ఎటువంటి ప్రమాణం అవసరమో సెలవీయండి"అని విన్నవించు కున్నారు.

ప్రవక్త మహనీయులు(స) తన ప్రసంగంలో తొలుత కుర్ఆన్ పారాయణం చేశారు, దైవం వైపునకు పిలుపునిచ్చారు. ఇస్లామ్ వైపునకు, దాని బోధనల వైపునకు ఉత్సాహం కలిగించారు. ఆ తరువాత, "మీరు నాకు మాట ఇవ్వాలి, ప్రమాణబద్ధులవ్వాలి- మీరు మీ సంతానాన్ని భార్యాపిల్లల్ని రక్షించే విధంగా నన్ను రక్షిస్తామని. దానికి బదులుగా పరలోకంలో స్వర్గం ప్రాప్తిస్తుంది." అప్పుడు యస్రిబ్ వారంతా లేచి ముందుకు ప్రవక్త వైపునకు అడుగు వేశారు. వారిలో అందరికన్నా పిన్న వయస్కుడయిన యువకుడు, అస్ అద్ బిన్ జురారహ్ ప్రవక్తశ్రీ(స) చెయ్యిని తన చేతిలో తీసుకుని, "యస్రిబ్ వాసులారా, కాస్త ఆగండి, మనందరికీ బాగా తెలుసు ఈయన దైవ సందేశహరులు. ఈయన్ని మనం యస్రిబ్‌కు తీసుకుని వెడితే దాని భావం అరేబియా అంతటితో శత్రుత్వాన్ని కొనిదెచ్చుకోవడం అన్నమాట. కత్తులు మీ రక్తాన్ని, మీ సంతానం రక్తాన్ని చవిగొంటాయి. ఇదంతా భరించే శక్తి మీలో ఉంటే ఈయన చెయ్యి పట్టుకోండి, దానికి ఫలితం అల్లాహ్ వద్దనే ఉంది; లేదా మీకు మీ ప్రాణభయమున్నట్లయితే, ఇప్పుడే వదిలేయండి, స్పష్టంగా మా వల్ల కాదని చెప్పివేయండి, ఇప్పుడు ఇలా చెప్పడం, అల్లాహ్‌కు బహుధా స్వీకారయోగ్యం కావచ్చు." అని ప్రసంగించాడు. దానికి అందరూ ముక్తకంఠంతో, "అస్అద్, మా దారి మధ్యనుంచి తొలిగిపో, దైవం సాక్షి, మేము ఈ ప్రమాణాన్ని ఎట్టి పరిస్థితిలోనూ వదలుకోము, ఈ చెయ్యినీ వెనక్కి లాక్కోము" అని అన్నారు.

## విప్లవ ద్వారం

కొండ కనుమ వద్ద జరిగిన ఈ ప్రమాణం, వాగ్దానం, ఒప్పుకోలు, సాధారణమయినది కాదు. ఇస్లామీయ ఉద్యమ చరిత్రలో ఓ మహా విప్లవానికి సింహద్వారం తెరచిన ఘట్టం! దైవం తన ప్రవక్తకు అందజేయగా ప్రవక్త మహనీయులు(స) చెయ్యిచాచి అందుకున్నారు. అదే సమయాన యస్రిబ్‌వాసులు అంతిమ దైవసందేశహరుని తమ ఇంట ఆహ్వానిస్తున్నారంటే సాధారణ విషయం కాదు, ఆయన్ని దైవం తరఫున తమ నాయకుడు, పాలకుడు, ఏలికగా స్వీకరిస్తున్నారన్నమాట!!

అంతేకాదు, యస్రిబ్‌కు ప్రవక్త మహనీయులు వస్తున్నారంటే అర్థం, అది ఇస్లామీయ ఉద్యమ కేంద్రంగా మారనున్నదన్నమాట. అరేబియా అంతటి నుండి ముస్లిములయిన వారంతా ఈ కేంద్రీయ స్థానం వైపునకు ప్రవాహ రూపంలో రానున్నారన్నమాట. యస్రిబ్, ఓ సాధారణ గ్రామం, బలమయిన, వ్యవస్థీకృతమయిన ఓ ఇస్లామీయ సమాజానికి నిలయమవుతుంది. యస్రిబ్ ఓ మహా నగరం- మదీనతుల్ ఇస్లామ్, మదీనతున్నబీగా రూపాంతరం చెందుతుంది. లోకం కళ్ళు దాని మీద కేంద్రీకృతమవుతాయి. దేశంలోని, కత్తులూ కటారులు, దాని మీదికి దాడి చేస్తాయి. ఇదంతా అర్థం చేసుకుని, క్షుణ్ణంగా గ్రహించి ప్రవక్తశ్రీ(స)ని ఆహ్వానించారు యస్రిబ్‌వాసులు. ఆ సందర్భంలో అక్కడ జరిగిన కొన్ని చిన్న చిన్న ప్రసంగాలు, సమాలోచనల అధ్యయనం వల్ల ఇది అతి స్పష్టంగా ప్రస్ఫుటమవుతుంది.

ఆ సందర్భంలో ప్రవక్త మహనీయులు(స) ఆ ప్రమాణం జరిగిన పిమ్మట, యస్రిబ్ వారిని, తమలో నుంచి 12 మందిని ఎన్నుకుని తనకు ఇవ్వమని, వారిని యస్రిబ్‌లో నా తరఫున బాధ్యతాయుతు లయిన నాయకులుగా నియమిస్తాను, ఈసా(అ) శిష్యుల్లా, (మరో ఉల్లేఖనం ప్రకారం) మూసా(అ) నియమించిన బనీ ఇస్రాయీల్ లోని 12మంది నాయకుల్లా అని పురమాయించారు. తదను సారంగా తొమ్మండుగురిని ఖజ్రజ్‌లోనుంచి, ముగ్గురిని ఔస్‌లో నుంచి ఎన్నుకుని వారిని ప్రవక్తశ్రీ ముందుంచగా ఆయన వారిని నియమిస్తున్నట్లు ధ్రువీకరించారు. పిమ్మట ఆ సమావేశం ముగిసింది.

## ఇస్రా- రేయి పయనం

మక్కా నగరంలో దైవదౌత్య మహత్కార్యం నిర్వహిస్తూ ప్రవక్త మహనీయులకు 12 ఏళ్ళు కడిచాయి. దేవుని ఏకత్వపు నినాదం, అనేక అడ్డంకులూ ఆటంకాలను దాటి, మక్కా పొలిమేరలకు ఆవల ప్రతిధ్వనిస్తూ ఉంది. ఆయనకు, ఆయన ఉద్యమానికి, దేవుని ఏకత్వపు నినాదానికి విరోధులయిన శక్తులు సత్యమార్గాన్ని నిరోధించడానికి చేయగలిగిందల్లా చేస్తూనే ఉన్నారు, అయినా సత్యం ఎంతోకాలం మరుగన పడి ఉండదు. అది వెల్తురులా తన దారి తాను వెతుక్కుని నలుదిశలా ప్రాకిపోతూనే ఉంటుంది. అరేబియాలో కనీసం ముగ్గురు నలుగురు వ్యక్తులు ఇస్లామ్

సందేశానికి ప్రభావితులయి సన్మార్గ గాములయిన వారు లేని ఒక్క తెగ కూడా లేదంటే అతిశయోక్తి కాదు. యస్రిబ్‌లోని రెండు బలమయిన తెగలు ఔస్, ఖజ్‌రజ్‌లోని ఓ పెద్ద సంఖ్య ప్రవక్తశ్రీ (స)ని బలపరిచే వారిది సిద్ధమయి ఆయన్ని పిలిచి అక్కడ ఉద్యమ కేంద్రాన్ని స్థాపించడానికి ఉవ్విళ్ళూరుతూ ఉంది. అటువంటి పరిస్థితుల్లో ఓ దివ్య సంఘటన సంభవించింది. అది ప్రవక్త జీవితంలో కలికితురాయి వంటిదేకాక ఇస్లామీయ యోధుల విశ్వాసానికి అత్యంత ఉజ్వలమయిన గీటురాయిగా పరిణమించింది.

ఆ సంఘటనను దివ్య కుర్‌ఆన్‌లో ప్రస్తావించడం జరిగింది. దాని వివరాలు హదీసు గ్రంథాల్లో ప్రాప్తమవుతాయి. దివ్య గ్రంథంలో ఇలా ఉంది :

> పరిశుద్ధుడాయన, తన దాసుడిని, ఒక రేయిన పవిత్రమయిన మస్జిద్ నుండి బహుదూరపు మస్జిద్ వరకు తీసుకువెళ్ళినవాడు. దాని పరిసరాలను ఆయన శుభకరం చేసిపెట్టాడు- తన సూచనలను కొన్నింటిని అతనికి చూపెట్టాలని. (బనీ ఇస్రాయీల్ 17: 1)

అప్పటికి దైవదౌత్యం ఆవిర్భావమయి 12 ఏళ్ళయింది. ప్రవక్త మహనీయుల వయసు 52 సంవత్సరాలు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం అది రజబ్ నెల 27వ తేదీ. ఆయన ఇషా నమాజ్ చేసుకుని తన పెత్తండ్రి అబూ తాలిబ్ కుమార్తె 'ఉమ్మెహానీ' ఇంట నిద్రపోయారు. అకస్మాత్తుగా దైవదూత జిబ్రీల్ అపరాత్రి వేళ వచ్చి లేపారు. ఆయన్ని కాబా గృహం వద్దకు తీసుకువెళ్ళారు. అక్కడ బుర్రాక్ అనే ఓ వాహనం సిద్ధంగా ఉంది. దాని మీద ప్రవక్తశ్రీ(స)ని ఎక్కించుకుని బైతుల్ మక్దిస్ తీసుకువెళ్ళారు. అక్కడ ప్రవేశించగా అక్కడ ఆది నుండి అప్పటివరకు ఆవిర్భవించిన ప్రవక్తలందరూ హాజరయి ఉన్నారు. ఆయన(స) చేరగానే నమాజ్ కొరకు బారులు తీరి అందరూ సిద్ధమయ్యారు. నమాజ్ నాయకత్వానికి జిబ్రీల్ ప్రవక్త మహనీయుల్ని చెయ్యి పట్టి ముందుకు పంపారు. ఆయన(స) నమాజ్ చేయించారు. నమాజ్ ముగిసిన తరువాత ఆయన ముందు జిబ్రీల్ మూడు గిన్నెలుంచారు. ఒకదానిలో నీరు, మరొక దానిలో పాలు, మూడవ దానిలో సారాయి ఉంది. ఆయన పాలగిన్నె అందుకున్నారు. జిబ్రీల్(అ),"మీరు ప్రకృతి మార్గాన్ని పొందారు" అని శుభాకాంక్షలు

## మేరాజ్ ప్రయాణం శారీరకంగా జరిగిందా? ఆధ్యాత్మికంగానా?

ఇస్రా, రేయి పయనం, ఆ తరువాత మేరాజ్ ఊర్ధ్వలోకాల ఆరోహణం ఎలా జరిగింది? శారీరకంగా ఎలా సాధ్యం? స్వాప్నికంగా జరిగిందా? లేదా ఆధ్యాత్మికంగా జరిగిందా? ఇవన్నీ సాధారణంగా భౌతికవాద ప్రధానమయిన నేటి ప్రపంచంలో లేవనెత్తే ప్రశ్నలు. స్వయంగా దివ్య కుర్‌ఆన్ దీన్ని ప్రస్తావించింది కాబట్టి ప్రథమంగా అక్కడ పరిశీలించాలి. దివ్య గ్రంథంలో దాన్ని ప్రస్తావిస్తూ ప్రయోగించిన పదాలను గమనించాలి.

పరిశుద్ధుడు ఆయన, తన దాసుని ఒక రేయిన పవిత్ర దైవగృహం నుంచి తాను శుభప్రదం చేసిన దూరపు మస్జిద్ వద్దకు తీసుకువెళ్ళినవాడు. అతనికి తన సూచనలు కొన్నింటిని పరికింపజేయడానికి. (బనీ ఇస్రాయీల్ 17: 1)

"పరిశుద్ధుడు ఆయన" అనే పదాలే చాటి చెబుతున్నాయి, ఇది ఏదో మామూలుకు భిన్నమయిన విషయమయి ఉంటుంది అని. అది విశ్వప్రభువు అల్లాహ్ అపారమయిన శక్తుల ద్వారా రూపుదాల్చి ఉంటుంది అని. ఎవరయినా స్వాప్నికంగా ఏదయినా చూసినా లేదా ఆధ్యాత్మికంగా దేన్నయినా చూడగలగటంలో దేవుని, సకల బలహీనతలకు అతీతమయిన, సమస్త కొరతలకు దూరమయిన వ్యక్తిత్వం ప్రస్తావన అవసరం లేదు. కలల్లోనూ, ఆధ్యాత్మిక కృషి ద్వారానూ మనుషులు ఏమయినా చూడగలుగుతారు, ఏమయినా అనుభవించగలుగుతారు. అవి మానవుల అనుదిన అనుభూతులే! కాని ఇది అలాంటిది కాదు, విశ్వప్రభువు అన్ని లోపాలకు అతీతుడయిన స్వామి తన దాసుని (అంటే వ్యక్తిని) "తీసుకు వెళ్ళాడు". ఇవి స్పష్టంగా శారీరక ప్రయాణమని సూచించే పదాలు. ఇది ఏదో స్వాప్నిక ప్రయాణమో లేదా ఆధ్యాత్మిక ప్రయాణమో కాదు. ఆపైన అది కేవలం స్వాప్నిక లేదా ఆధ్యాత్మిక అనుభవం కాదు 'పరికింపజేయడానికి' అంటే చర్మచక్షువులతో చూడటం అనే భావం అందులో నిబిడీకృతమయి ఉంది.

మానవుడు నిర్మించిన విమానాల ద్వారా, అంతరిక్ష వాహనాల ద్వారా క్షణాలలో దినాల పయనం సుసాధ్యమయితే అంతులేని ఈ మహా జగత్తునే నిర్మించిన విశ్వప్రభువు, స్వయంగా మానవుడినే సృజించిన మహా విశ్వకర్త దైవానికి, తన ప్రియతమ దాసుడు ముహమ్మద్‌ను కాంతి వేగాన్ని మించిన వేగంతో క్షణాల్లో గగనాంతర విహారం చేయించడం వింతగా, అసాధ్యమయినదిగా, అసంభవమయినదిగా అగుపిస్తోందా? అయితే ఒక్కటి; అసలు సృష్టికర్తనే తిరస్కరించే, దైవాన్నీ దైవిక శక్తినే కాదనే మేధో సంపన్నులయిన వారిని గురించి ఎవరూ ఏమీ చెప్పలేరు. కాని ఈ గగన భువనాల సృజనకర్త, సంచాలకుడు, నిరంతరం వీక్షిస్తూ రక్షిస్తూ ఉన్న శక్తి ఒకటి ఉందని నమ్మే మానవ హృదయాలకు ఇది సునాయాసంగా బోధపడే విషయమే. కాలం- దూరం అన్న బంధనాలు సృష్టికే కాని సృష్టికర్తకు కావు!

తెలిపారు. ఆ తరువాత ఓ నిచ్చెన ద్వారా ఊర్ధ్వలోకాలకు ఆయన(స) జిబ్రీల్(అ)తోపాటు అధిరోహించారు. ఆయన తన ఈ గగన యానంలో స్వర్గ నరకాలను దర్శించడంతోపాటు అల్లాహ్ ద్వారా ముస్లిమ్ సముదాయానికి అయిదు వేళల నమాజ్ విధి అయిన ఆదేశాలూ తీసుకువచ్చారు. ఆ తరువాత ఆయన వెళ్ళిన రీతిలోనే తిరిగి వచ్చారు. ముక్తసరిగా ఇదీ మేరాజ్ లేదా ఆరోహణం కథనం.

## మహనీయ అబూబక్ర్ ధ్రువీకరణ ఘనత!

తెల్లవారిన తరువాత ఆయన ప్రప్రథమంగా తన పెత్తండ్రి కూతురు, సోదరి ఉమ్మె హానీకి రాత్రి జరిగినదంతా వివరించారు. బయటికి వెళ్ళే సంకల్పంతో తయారవగానే ఆవిడ ఆయన ఒంటిపైని దుప్పటి పట్టుకున్నారు. "దైవం పేరిట ప్రాధేయ పడుతున్నాను, ఈ గాథ ఎవరికీ వినిపించకండి, ఇది వింటే మిమ్మల్ని ఆట పట్టించేందుకు జనులకు ఓ సాకు దొరుకుతుంది" అని వేడుకున్నారు. కాని ఆయన "నేనయితే తప్పక వినిపిస్తాను" అనుకుంటూ బయటికి నడిచారు.

కాబా ప్రాంగణంలో అడుగుపెట్టగానే అబూ జహ్ల్ ఎదురయ్యాడు. అతను, "ఏదయినా తాజా వార్త?" అన్నాడు. "ఆఁ! ఉంది!!" అన్నారాయన. "ఏమిటీ?... అందరినీ ప్రోగు చెయ్యమంటారా? అందరి సమక్షంలో చెబుతావా?" అడిగాడు; దానికి ఆయన "నేను రాత్రి బైతుల్ మక్దిస్ వెళ్ళాను" అతను, "ఎక్కడికీ... బైతుల్ మక్దిసా?, రాత్రికి రాత్రే వెళ్ళి వచ్చావా?..తెల్లవారి ఇక్కడున్నావా?" అడిగాడు. అబూ జహ్ల్ కేక వేయసాగాడు, అందరినీ ప్రోగు చేశాడు, "ఇక చెప్పు జరిగిందేమిటో?" అన్నాడు. ఆయన(స) అందరి సమక్షంలో గాథనంతా వివరంగా చెప్పారు. జనం అపహాస్యం చెయ్యసాగారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా.. ఒకరు చప్పట్లు కొడుతుంటే మరొకడు తలపై వింతగా చేతులు పెట్టుకున్నాడు. 'రెండు నెల్ల ప్రయాణం ఒక్క రాత్రిలోనా? అసంభవం! ముందయితే కేవలం అనుమానంగా చెప్పేవారము-కాదు, ఇప్పుడు నమ్మకంగా చెబుతున్నాము, నీకు పిచ్చి పట్టింది." అన్నారు వారు.

క్షణాల్లో ఈ సమాచారం మక్కా అంతటా వ్యాపించింది. కొందరు ముస్లిములు సయితం వింతకు లోనయి పోయారు. కొందరు అబూబక్ర్(ర) వద్దకు వెళ్ళారు వేగంగా. ఆయన ముహమ్మద్(స)కు కుడిభుజం. అతను గనక ఇస్లామ్‌కు దూరమయితే ఉద్యమంలో నుంచి ఊపిరి తీసివేసినట్టవుతుందని పరిగెత్తారు. ఈ గాథనంతా విని ఆయన, ఆయన నిజంగా ఇలా చెప్పారా? అని అడగ్గా అవునని వారు సమాధానం ఇచ్చారు. దానికి ఆయన, "అయితే తప్పక నిజమయి ఉంటుంది. అందులో ఆశ్చర్యమేముంది? నేనయితే అనుదినం వింటూ ఉంటాను, ఆయనకు గగనతలం నుండి, దైవ సన్నిధి సందేశాలు అందుతూ ఉంటాయని, నేను వాటిని అన్నింటినీ నిజమని ధ్రువీకరిస్తూ ఉంటాను.

ఆ తరువాత ఆయన కాబా గృహానికి వచ్చారు.అక్కడ దైవ సందేశహరులున్నారు, అపహసించే మూక కూడా ఉంది. మహనీయ అబూబక్ర్ వచ్చి ఆయన్ని జనం ముందు అడిగారు, "మీరు నిజంగా ఇలా చెప్పారా? అని. ఆయన అవును అని సమాధానమిచ్చారు. జనం ఉత్సాహంతో ఇదంతా మౌనం వహించి వినసాగారు. అప్పుడు మహనీయ అబూబక్ర్ ఇలా అన్నారు, "బైతుల్ మక్దిస్ నేను చూసిన స్థలమే. మీరు కాస్త అక్కడి వివరాలు తెలుపండి". ఆయన ఒక్క క్షణం జాగు చెయ్యకుండా దాని వివరాలు తెలుపసాగారు. బైతుల్ మక్దిస్ తన కళ్ళెదుట ఇప్పుడు కనిపిస్తున్నట్లు ఒక్కొక్క విషయాన్ని సవివరంగా రన్నింగ్ కామెంటరీలా చెప్పసాగారు. మహనీయ అబూబక్ర్ యుక్తి వల్ల తిరస్కరిస్తూ వారి నోళ్లు గట్టిగా మూసుకున్నాయి.

## మరిన్ని సాక్ష్యాధారాలు!

ఆనాడు ప్రవక్త(స) సమక్షంలో ప్రోగయిన జనంలో, తమ వ్యాపార నిమిత్తం బైతుల్ మక్దిస్ వెళ్ళిన వారు కూడా చాలా మంది ఉన్నారు. వారికి తెలుసు ప్రవక్త(శ్రీ(స) ఎన్నడూ అటువైపు వెళ్ళలేదని. ఆయన తెలిపిన వివరాలను బట్టి వారు తమ ఆంతర్యాల్లో ఆయన పలుకుతున్నది వాస్తవమే అని దృఢంగా నమ్మారు. అయినా ఇంకా ఆధారాలు కావాలని కోరసాగారు జనం. అప్పుడు ప్రవక్త మహనీయులు, తాను వెడుతూ ఫలానా ఫలానా చోట ఫలానా ఫలానా బిడారాలు ఆయా సరుకులు తోడుగా ఉన్నవారిని చూశానని, ఒక బిడారు వారి ఒంటె బెదిరి పరిగెడితే నేను అది ఎటు పారిపోయిందో వారికి దాని జాడ తెలిపాను అన్నారు. అలాగే నేను తిరిగి వస్తున్నప్పుడు ఫలానా చోట ఓ బిడారు కానవచ్చింది. అందరూ అక్కడ నిద్రపోతూ ఉన్నారు. నేను వారి పాత్ర మూత తీసి నీరంతా త్రాగాను, మూత మళ్ళీ యధాతథంగా పెట్టివేశాను. నీరు త్రాగినట్లు గుర్తులు వదిలాను అని తెలిపారు. అలాగే ఇంకా కొన్ని సూచనలు ఆయన తెలిపారు. ఆ తరువాత వచ్చిన బిడారుల ద్వారా ఆ విషయాలన్నీ నిజమని రుజువయింది. మక్కా విరోధుల నోళ్ళయితే మూసుకున్నాయి కాని హృదయాలు- ఇది ఎలా సంభవం? అని ఆలోచిస్తూనే ఉండిపోయాయి- నేటికీ కొన్ని మనస్సుల్లో ఆశంక కెలుకుతూనే ఉంటుంది!

*__ఆధారం :__ 1) సీరతున్నబీ, ఇబ్నుహిషామ్ : సం.1; పు.438-442*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.2: పు.521-535; 561-573*

# సిగరెట్ స్మోకింగ్‌తో ఆరోగ్య సమస్యలు ఎన్నో!




**ధూమపానం** ఆరోగ్యానికి హానికరం... బస్సులు, సినిమా థియేటర్లు, దవాఖానలు, ప్రభుత్వ కార్యాలయాల్లో.. ఇలా అనేకచోట్ల కనబడే ఈ హెచ్చరికను మాత్రం ధూమపాన ప్రియులు పట్టించుకోవడం లేదు. 'బహిరంగ ధూమ పానం నేరం' అని తెలిసినా లెక్కపెట్టడం లేదు. పొగతాగడం వల్ల చాలా రకాలుగా శరీరానికి ముప్పు ఉన్నదని తెలిసినా సిగరెట్ దమ్ము కోసం తాపత్రయపడుతున్నారు. సరదా కోసమో లేక అభిమాన హీరో తనదైన శైలిలో స్మోకింగ్ చేయడాన్ని చూసిన కొందరు.. ముచ్చటపడి చేసుకున్న ఈ అలవాటు.. క్రమంగా వారిని ఆక్రమించి విడదీయరాని బంధంగా మారిపో తుంది. పొగాకు ఉత్పత్తుల్లో దాదాపు 4వేల రకాల రసాయ నాలు ఉంటాయనే విషయం చాలామందికి తెలియదు. ఆరోగ్యాన్ని, ధనాన్ని నష్టపరిచే ఈ దురలవాటు నుంచి బయట పడాలని ప్రయత్నించినా సాధ్యంకాని విధంగా దానికి దాసోహం అవుతు న్నారు. ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం సందర్భంగా పొగాకు, దాని ఉత్పత్తుల ద్వారా ఎలాంటి హాని ఉంటుందో తెలుసుకుందాం. సిగరెట్, బీడీ, చుట్ట, హుక్కా పీల్చడం ఇలా ఏ రూపంలో ఉన్నా.. అంతిమంగా పొగ తాగడమే. దీనివల్ల పొగాకులోని నికోటిన్‌తో టార్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ సైనైడ్, అమ్మోనియా, ఫార్మల్డిహైడ్, ఆర్సెనిక్, డీడీటీ వంటి హానికర పదార్థాలు శరీరంలోకి తేలిగ్గా చేరతాయి. సిగరెట్లు ఎక్కువగా తాగేవారి ఊపిరితిత్తుల్లో బూడిద పేరుకుపోయి నల్లగా తయారవుతాయి. ఊపిరితిత్తు ల్లోని కణాలు కణుతులుగా మారి క్యాన్సర్‌గా రూపుదిద్దు కుంటుంది.

స్మోకింగ్ చేసేవారు తమ ప్రాణాల పట్లే కాదు, ఇతరుల ప్రాణాల విషయంలోనూ చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. తాము స్మోకింగ్ చేయడమే కాకుండా తమ పక్కన ఈ అలవాటు లేనివారికీ పాసివ్ స్మోకింగ్ ద్వారా విషాన్ని అందిస్తున్నారు. ఒక్క సిగరెట్ తాగడం ఒక్కటే కాదు.. పొగాకు సంబంధ పదార్థాలైన గుట్కా, ఖైనీ, జర్దా పాన్ వంటివి తీసుకోవడం కూడా ఆరోగ్య సమస్యలను తెచ్చేవే అని గుర్తుంచుకోవాలి. చాలా మంది వ్యాధులు మొదలయ్యే వరకు స్మోకింగ్ చేస్తూ ఆ తర్వాత ఈ అలవాటును ఎలా వదిలేయాలో తెలియక తికమక పడుతుంటారు.

పొగాకు శరీరంలోని వివిధ అవయవాలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను చూపిస్తుంది. పొగాకు వినియోగించే అలవాటుని అనుసరించి ఆయా శరీర భాగాలు ప్రభావిత

మవుతుంటాయి. పొగతాగే వారు, పొగాకుని వాడేవారి చర్మం వయసుతో సంబంధం లేకుండా వేగంగా ముడతలు పడుతుంది. పొగాకులోని నికోటిన్ వయసుతో సంబంధం లేకుండా కాటరాక్ట్, గ్లకోమా వంటి సమస్యలను తీసుకొస్తుంది. ఇవి క్రమంగా పూర్తి అంధత్వానికి కారణమవుతాయి. పొగాకు వాడకం లైంగిక జీవితంపై చాలా ప్రభావాన్ని చూపిస్తుంది. పురుషులలో ఇది అంగస్తంభన సమస్యలకు కారణమవుతుంది.

పొగాకు వాడకం ముందుగా నోరు, దంతాలు, చిగుళ్లు, నాలుక, ఇతర భాగాలను దెబ్బతీస్తుంది. నోటిలో అల్సర్లు రావడంతో మొదలై, అది క్రమంగా క్యాన్సర్‌గా పరిణమిస్తుంది. ధూమపానం వల్ల పొగాకులోని నికోటిన్ నేరుగా మెదడుకు చేరుకుని.. నెమ్మదిగా రక్తపోటును పెంచుతుంది. పొగతాగే అలవాటు కారణంగా మూత్రపిండాల పనితీరు మందగించడమే కాకుండా మూత్రాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

## పొగ మానేస్తే... లాభాలు

చర్మం కాంతిమంతంగా మారుతుంది.

ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది.

రోజుకు ఒక ప్యాకెట్ చొప్పున వాడే వారికైతే రూ.36,500 మిగులుతాయి. గుండెజబ్బులు వచ్చే అవకాశాలు సగానికి సగం తగ్గిపోతాయి.

పక్షవాతం ముప్పు చాలా వరకు తగ్గిపోతుంది. పూర్తిగా పొగతాగని వారితో సమానంగా మీ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

## పొగ మానుకోవాలంటే..?

పొగరాయుళ్లలో దాదాపు సగం మందికి ఆ అలవాటును మానేయాలనే ఉంటుంది. అయితే, పొగాకులోని నికోటిన్ ప్రభావానికి బానిసలుగా మారడం వల్ల అంత తేలికగా అలవాటును వదులుకోలేరు. 'పొగ'ను వదులుకోవడం కష్టం కావచ్చేమో గానీ, అసాధ్యం మాత్రం కాదని నిపుణులు చెబుతున్నారు. చిత్తశుద్ధితో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పూర్తిగా ఈ అలవాటు నుంచి బయటపడవచ్చని అంటున్నారు. వారు చెబుతున్న జాగ్రత్తలు ఇవీ...

➢ సిగరెట్‌ను మానేయడానికి మిమ్మల్ని బాగా ప్రభావితం చేయగల బలమైన కారణాన్ని ఎంచుకోండి. ఉదాహరణకు పరోక్ష పొగ నుంచి మీ కుటుంబ సభ్యులను రక్షించడం, మరింత యవ్వనంగా కనిపించడం, క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవడం వంటి కారణాలు.

➢ మీ మెదడు నికోటిన్ ప్రభావానికి బాగా అలవాటు పడే ఉంటుంది. దాని నుంచి ఎలాగైనా బయటపడాలని బలంగా తీర్మానించుకోండి. అందుకు మానసికంగా సంసిద్ధులవండి.

➢ పొగతాగడం మానేయాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు చెప్పి, ఈ విషయంలో వారి సహాయ సహకారాలను కోరండి.

➢ మానేయడం వల్ల తలనొప్పి, భావోద్వేగాల్లో మార్పులు వంటి ఇబ్బందులు తలెత్తినా కంగారు పడకండి. పదేపదే సిగరెట్ కోసం నాలుక పీకుతున్నా దాని నుంచి మనసు మళ్లించే ప్రయత్నాలు చేయండి. అప్పటికీ సాధ్యం కాకుంటే, మానసిక వైద్యులను సంప్రదించండి.

➢ 'పొగ' నుంచి మనసు మళ్లించుకోవడానికి మీకు ఇష్టమైన వ్యాపకాన్ని ఏర్పరచుకోండి. ఉదాహరణకు పుస్తక పఠనం, వ్యాయామం, ట్రెక్కింగ్ వంటివి ప్రయత్నించండి.

➢ 'పొగ' నుంచి మనసు మళ్లించే మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యుల సలహాపై వాటిని క్రమం తప్పకుండా వాడి, ఈ అలవాటు నుంచి విజయవంతంగా బయటపడండి.

➢ పొగతాగే అలవాటును మానేసే ప్రయత్నంలో ఒకటికి రెండుసార్లు విఫలమైనా మీరేమీ బాధపడకండి. మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూనే ఉండండి. తప్పకుండా మీ ప్రయత్నం ఫలిస్తుంది.



- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

# మనసును వెలిగించే దీపం నమాజ్



ఈ సృష్టి వెనకాల అనంతమైన శక్తి ఉంది. ఈ భూమ్మీద కోట్ల జంతువులు ఉన్నాయి. కొన్ని బిలియన్ల మనుషులు ఉన్నారు. ఇంతమందిలో ఎవరికి వారు ప్రత్యేకంగా ఉండడం ఎలా సాధ్యమైంది? దేవుడు మాత్రమే అది చేయగలడు. అనంతమైన సృజనాత్మకతకి దైవం మూలం. మనం రోజు 5 సార్లు అల్లాహ్‌ను ఆరాధిస్తే ఓ అనిర్వచనీయమైన అనంతమైన శక్తి మనలో చోటు చేసుకుంటుంది. మనకు ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి కొత్త ఆలోచనలు వస్తాయి. మన ప్రార్థనలు పరిష్కారాలు ఇస్తాయి.

ఈనాడు సమాజంలో భక్తి పాత్ర తరిగి భుక్తి పాత్ర పెరిగింది. ప్రతి పని వెనుక, ప్రతి మాట వెనుక, ఏదో ఒక స్వార్థం ఉంటుందని, ఉండాలని ఆశించే వారికి నమాజు మహిమ అర్థం కాదు. అలాంటి వారికి వారి చిత్తశుద్ధి లేని ప్రార్థనల వల్ల మోక్షం కూడా లభించదు. ప్రార్థన అంటే రుకూ, సజ్దాల వంటి వివిధ భంగిమలు మాత్రమే కాదు. ఎందుకంటే ? అజ్ఞానం, అహంభావాల వల్ల మూసుకుపోయిన అంతశ్చక్షువుల్ని తెరిపించడమే ప్రార్థన ధర్మం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

“వారి ముందు కరుణామయుని సూక్తులు పఠిస్తుంటే వారు కన్నీటి ధారలతో సాష్టాంగ పడుతుండేవారు. ఆ తరువాత అనర్హులు, అయోగ్యులు వారికి వారసులయ్యారు. వారు నమాజుని వదిలేసి మనోవాంఛలకు బానిసలైపోయారు.” (ఖుర్‌ఆన్ 19: 58,59)

“మరికొందరు మా సూక్తులు విన్పించి హితోపదేశం చేయ గానే సజ్దా చేస్తారు.” (కుర్‌ఆన్ 32:15)

(కరుణామయుని నిజ భక్తులు) అసత్యానికి ఎన్నడూ సాక్షులుగా ఉండరు. ఎప్పుడైనా వారు పనికిమాలిన విషయం మీదుగా పోవలసివస్తే దాన్ని పట్టించుకోకుండా హుందాగా, గౌరవప్రదంగా దాటి వెళ్తారు. వారికి వారి ప్రభువు సూక్తులు విన్పించి హితోపదేశం చేయడం జరిగితే వారు అంధులుగా, బధిరులుగా వాటిపై పడిపోరు. (దివ్య ఖుర్‌ఆన్ 23: 79)

అల్లాహ్ పవిత్ర నామాల్లో అలీమ్, ఆలిమ్, అల్లామ్ అనే నామాలు కూడా ఉన్నాయి. అంటే జ్ఞానానికి మూలం అల్లాహ్ అని అర్థం. ఎంతటి ఉద్దండ పండితుడైనా తనకు తెలిసిన విషయాన్ని సౌమ్యంగా తెలియజేసి, ఎంతో వినయంగా చివర్లో వల్లాహు ఆలము బిస్సవాబ్ (అల్లాహ్‌కు మాత్రమే వాస్తవ జ్ఞానం ఉంది) అని చెప్పటం ఆనవాయితీ. మన శరీరంలో ఎన్నో పనులు వాటికవే జరుగుతాయి. మన శరీరం లోనే కాదు, ఈ ప్రకృతిలో ప్రతిదీ అల్లాహ్ ఆనతో దానికి అదే జరుగుతుంది. చీమల్లో, చెట్లలో, కీటకాలలో,

జంతువుల్లో, మనుషుల్లో విజ్ఞానాన్ని మనం చూస్తాం. మన శరీరానికి, ఆ చీమలకి ఎవరూ ఈ జ్ఞానాన్ని నేర్పలేదు. ఈ జ్ఞానానికి మూలం దైవం. మనం ప్రార్థన చేస్తే అల్లాహ్ జ్ఞాన కృపలతో అనుసంధానమయ్యి మనలోకి మరింత జ్ఞానాన్ని వచ్చేలా చేస్తుంది. మనం ఆరాధన ద్వారా అల్లాహ్‌కు దగ్గర అయినప్పుడు గొప్ప ఆలోచనలు, భావాలు, మంచి మాటలు మన జీవితాన్ని ప్రభావవంతంగా మలచడమేకాక ఈ ప్రపంచం మీద గొప్ప సానుకూల ప్రభావాన్ని చూపిస్తాయి.

"తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన్ని స్మరిస్తారు. అహంకారంతో విర్రవీగరు. వారు రాత్రిళ్ళు బాగా మేల్కొని దైవారాధనలో గడుపుతారు. ఆశతో, భయంతో తమ ప్రభువును వేడుకుం టారు." (కలం 92 : 100) ఒక మనిషి నమాజుని తెలిసో తెలియకో సక్రమంగా చేయకపోతే.... ఏమిటి? ఇలాగేనా నమాజు చేసేది? అని కసురుకోకండి. నమాజు ముగిసాక పక్కన తీసుకెళ్ళి చక్కగా విడమరచి చెప్పండి. ఒకసారి ఒక గిరిజన వ్యక్తి దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో ఆయన మస్జిద్లో కూర్చుని ఉన్నారు. ఆ వ్యక్తికి మూత్రం వచ్చింది. మస్జిద్ మర్యాదలు పాపం అతనికి తెలియవు. అక్కడే నిలబడి మూత్రం పోయసాగాడు. అతన్ని దండించే ఉద్దేశ్యంతో నలువైపుల నుంచి అక్కడున్న ప్రవక్తగారి సహచరులు చుట్టుముట్టారు. ఈ దృశ్యాన్ని గమనిస్తున్న ప్రవక్త(స), "అతన్ని మధ్యలో ఆపకండి. కాస్త నీరు తెచ్చి పోయండి. అల్లాహ్ మిమ్మల్ని ఉనికిలోకి తీసుకు వచ్చింది సౌలభ్యాల కోసమేగాని సంకట స్థితిని సృష్టించడా నికి కాదు సుమా!" అని మందలించారు. (బుఖారీ)

మనందరికీ చుట్టూ ఒక చట్రం ఉంటుంది. ఆ చట్రంలో ఆలోచనలు, ఉద్వేగాలు, శక్తి నిండి ఉంటాయి. మనం మనస్ఫూర్తిగా ప్రార్థన చేసినప్పుడు ఆ చట్రం శుభ్ర పడు తుంది. దృఢంగా మారుతుంది. అలాంటి చట్రం మనకు ఎన్నో లాభాలు చేకూర్చుతుంది. ఆలోచనలో స్పష్టత వస్తుంది. మానసిక ప్రశాంతతను రోగనిరోధకశక్తిని సరైన నిర్ణయాలు తీసుకునే శక్తిని ఇస్తుంది. దీనికిగాను మనం అల్లాహ్‌ను ఆరాధించేటప్పుడు ఆశ, భయం, ప్రేమ మదినిండా గూడు కట్టుకోవాలి. ఇదే విషయాన్ని ఖురాన్ ఇలా అంటుంది "విశ్వాసులారా! మీరు గనక భయభక్తుల వైఖరి అవలంబిస్తే అల్లాహ్ మీకు మంచీ చెడుల విచక్షణాజ్ఞానం ప్రసాదిస్తాడు. మీలో ఉన్న చెడుగులు తొలగిస్తాడు, మీ తప్పులు మన్నిస్తాడు. అల్లాహ్ అపార దయామయుడు. (అన్ఫాల్ : 29)

ఓ వ్యక్తి తాగుడు, ఇతర వ్యసనాలకి బానిసై జీవించాడు. తరువాత పశ్చాత్తాపం చెంది మస్జిద్‌కు వస్తే అతని ఈ భయం భక్తీ ఎన్నాళ్ళు ఉంటుందనీ? ఇది ఉడతా భక్తి లాంటిదేనని వెక్కిరించకండి. అతనిలో వచ్చిన ఆ మార్పుకి అతన్ని అభినం దించండి. మరింత మంచిగా మారేందుకు దోహదపడే ప్రోత్సాహాన్నివ్వండి.

"ఇక్రమా"నే తీసుకోండి. ఇతను ఇస్లాం, ముస్లిములకు బద్ధ విరోధి. దైవ విరోధి అయిన అబూజహల్ కుమారుడు. ముస్లింగా మారక పూర్వం తన తండ్రిలానే దైవప్రవక్త(స)ను అదేపనిగా వేధిస్తుండేవారు. మక్కా విజయం అనంతరం దైవప్రవక్త(స)కు భయపడి మక్కా నుండి యమన్ పారిపో యాడు. అప్పటికే ఇస్లాం స్వీకరించిన అతని భార్య యమన్ వెళ్ళి దైవప్రవక్త(స) గారి మన్నింపుల వైఖరిని గురించి వివరించింది. తన భర్త చేత ఇస్లాం స్వీకారం చేయించి దైవ ప్రవక్త(స) గారి సమక్షంలో తీసుకు వచ్చింది. దైవప్రవక్త(స) "ఇక్రమాను చూడగానే ఆనందంతో లేచి గబగబా అతని వైపుకు వెళ్ళారు. ఆ తొందరలో ఆయన(స) భుజంపైన కండువా సయితం జారి పోయింది. ఆ సమయంలో ఆయన నోట వెలువడిన మాటలివి!" ఓ మరలి వచ్చినవాడా! నీ రాక శుభప్రదమవుగాక! (మిష్కాత్)

అవును! హృదయం లోపల పశ్చాత్తాప భావం ఏర్పడ్డాక అంత త్వరగా చెదిరిపోదు. కాకపోతే ఒక మనిషిలో ఉన్నది. స్వచ్ఛమైన విశ్వాసమా? లేదా పరిసరాల ప్రభావమా? లేక ప్రదర్శనా భావమా? అని సందేహం కలగవచ్చు. ఆరాధనను కేవలం ఓ ఆచరణా రీతిగా చూసే సమాజంలో ఇలాంటి అనుమానాలు రావటంలో ఆశ్చర్యం లేదు. అల్లాహ్ ఇలా అంటున్నాడు : "వారు ప్రార్థన చేయడానికి లేస్తే వళ్ళు విరుచుకుంటూ చాలా బద్ధకంతో లేస్తారు. దైవమార్గంలో ఖర్చు పెట్టవలసి వస్తే ఏడ్పు ముఖంతో చాలా అయిష్టంగా ఖర్చు పెడతారు." (దివ్య ఖుర్‌ఆన్ - 9:54)

మానవునికి మేమేదైనా అనుగ్రహిస్తే అతను మాకు విముఖు డయి పోతాడు. పైగా అహంకారంతో విర్రవీగుతాడు. కాని అదే కష్టమొచ్చినప్పుడు సుదీర్ఘ ప్రార్థనలు చేస్తాడు. (ఫుస్సిలత్ : 51)

మనలో చాలా మంది కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే అల్లాహ్‌ను ఆరాధిస్తారు. దేవుడు అద్భుతాలు చేసి మన కష్టాలని తొలగిస్తాడని అనుకుంటాము, సందేహం లేదు. కానీ మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే అల్లాహ్

మనకు  ఆలోచన, శక్తి, జ్ఞానం ఇచ్చి మన సమస్యలను మనమే పరిష్కరించుకునేలా చేస్తాడు. ఆలోచనలకు తగినట్టు ప్రవర్తించడం మన బాధ్యత. అల్లాహ్ మనకు శరీరాన్ని ఆత్మను ఇచ్చాడు. వాటి ద్వారా మనకు కావలసిన జీవితాన్ని మనం సృష్టించుకోవచ్చు. మనం బద్ధకంగా పడుకుని లేదా కాలయాపన చేస్తూ, లోకాన్ని, లోకుల తీరుని చూస్తూ గడిపేస్తూ అల్లాహ్ వచ్చి మన సమస్యలను తీర్చేస్తాడు అనుకోవడం పొరపాటు. దేవుడు మనకు అవకాశాలు ఇస్తాడు. వాటిని సద్వినియోగం చేసుకోవడం మన బాధ్యత.

కొన్నిసార్లు తెలియకుండానే మనం నెగిటివ్ ఆలోచనల్ని, ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటాం. మనం ప్రతి రోజూ అయిదు సార్లు అల్లాహ్‌ను ఆరాధిస్తే ఈ నెగిటివ్ ఎనర్జీ బయటికి వెళ్ళి పోయేలా చేసి మనలో ఒక పాజిటివ్ ఎనర్జీని నింపుతాడు. కాబట్టి ప్రార్థన చేయడం అనేది ఆధ్యాత్మికంగా స్నానం చేయడం లాంటిది. ఇది మన ఆత్మని నూతన శక్తితో నింపి రోజు ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మనల్ని సిద్ధం చేస్తుంది. ఖురాన్ ఇలా అంటోంది (సరే, మీకేవైనా ఇబ్బందులుంటే) సహనం, ప్రార్థనల ద్వారా (నా)  సహాయాన్ని అర్థించండి. ప్రార్థన (నమాజ్) కాస్త కష్టమైన పనే, సందేహం లేదు. కాని ఒకరోజు తమ ప్రభువును కలుసుకోవలసి ఉందని, ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉందని భావించే దైవభీతిపరులకు మాత్రం ప్రార్థన (నమాజ్) చేయడం కష్టమేమీ కాదు. (బఖర : 45-46)

కాని వీటన్నిటికీ అతీతంగా ఏర్పడే భక్తి భావన భాషకి అందదు. లోకం కళ్ళతో చూస్తే అది అర్థం కాదు. ప్రాపంచిక విషయాలన్నిటికీ అతీతంగా అల్లాహ్ పట్ల ఏర్పడే భక్తి ఓ నిరంతర ధ్యానం.

"విశ్వాసులు తప్పకుండా కృతార్థులవుతారు. వారు తమ నమాజులో ఎంతో అణకువ, నమ్రతలు పాటిస్తారు. పనికి మాలిన విషయాలకు చాలా దూరంగా ఉంటారు. తమ సంపద నుండి జకాత్ (పేదల ఆర్థిక హక్కు, చెల్లిస్తారు). వారు తమ అప్పగింతలు, ప్రమాణాలు, ఒప్పందాల విషయంలో నిజాయితీగా వ్యవహరిస్తారు. తమ నమాజులను క్రమం తప్పకుండా, నియమబద్ధంగా పాటిస్తారు.

అలాంటి వారే మహోన్నత స్వర్గానికి వారసులవుతారు. వారక్కడ కలకాలం (హాయిగా) వుంటారు. (దివ్యఖుర్ఆన్ 23: 10-11)

ఇలాంటి ధ్యాన స్థితిలో మనం ఉన్నామా? ఉంటే గనక మన జీవితం ధన్యం.

# మహావీర్ మందిరం మహా ఆదర్శం

## - అజాన్ టైములో మందిరం లౌడ్ స్పీకర్లు బంద్



మందిరం లౌడ్ స్పీకర్ల నుంచి  రోజంతా భజన కీర్తనలు వినిపిస్తుంటాయి. అజాన్ టైమ్ అయ్యిందంటే చాలు మందిరం లౌడ్ స్పీకర్లు మూగబోతాయి. అజాన్ ముగియగానే భజనకీర్తన మొదలవుతుంది. మందిరంలో ఏదైనా ఉత్సవం ఉందంటే చాలు మస్జిదు కమిటీ వారికోసం షర్బత్ అందించి వారి దాహార్తి తీరుస్తుంది. హిందూ ముస్లిముల సమైక్యతకు, సామరస్యతకు చక్కని నిదర్శనంగా నిలుస్తున్నాయి పట్నా మహావీర్ మందిరం, ఆ పక్కనే ఉన్న మస్జిదు. పట్నాలోని మహావీర్ మందిరం పాలకమండలి అజాన్ పిలుపును గౌరవిస్తూ తమ భజన కీర్తనలను కాసేపు బంద్ చేస్తుంది. ఇదే విషయాన్ని మందిరం ఛైర్మన్ కిషోర్ కునాల్ మీడియాకు చెప్పారు. 'మేం పరస్పరం సోదరభావంతో ముందుకెళుతున్నాం. తమకు భజన కీర్తనలతోనూ ఇబ్బంది లేదు, మస్జిదు లౌడ్ స్పీకర్ల నుంచి వచ్చే అజాన్ తోనూ ఎలాంటి ఇబ్బంది లేదు' అని వారు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా మస్జిదు కమిటీ వారు మందిరానికి వచ్చే భక్తులకు చల్లని షర్బత్ అందించి తమ సోదర ప్రేమను చాటుకున్నామని మస్జిదు కమిటీ ఛైర్మన్ ఫైసల్ ఇమామ్ అన్నారు.

# ప్రేమోన్మాదానికి అంతం ఎప్పుడు?

- పోలంకి విజయభాస్కర్

కోరుకున్న మనిషి తాననుకున్నట్లు చేరువ కావడానికి కొంత మంది ఉన్మాదులు మంచీ చెడు లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఆ మోహావేశం ఏ స్థాయిలో ఉంటుందంటే... నచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకోలేకపోవటం, ఆమె నుంచి సానుకూల స్పందన లేకపోవటం వలన ఆవేశం కమ్ముకుంటోంది. తత్ఫలితంగా అవతలి వారిని హింసించడం, వదిలించుకోవడం, నాకు దక్కనిది మరెవరికీ దక్కకూడదన్న ఉన్మాదానికి లోను చేస్తాయి. సమాజంలో లైంగిక అత్యాచారాలు పెరగటానికి కారణాలు అనేకం. స్త్రీల శరీరాల మీద దాడి చేయగల అధికారం మాకుందని నిరూపించుకోవాలని ప్రేరేపించే తత్వం తరతరాల పితృస్వామ్య భావజాలంలో పురుషు లలో పాతుకుపోవటం ఒక మౌలిక కారణం. దానికి సాంఘిక, రాజకీయ, ఆర్థిక కారణాలెన్నో తోడవుతాయి. పెరుగుతున్న పేదరికం వల్ల గ్రామాలలో పనిలేక, బ్రతికే దారి లేక పట్టణాలకు వలస వచ్చిన స్త్రీలకు ఏ రకమైన భద్రతా ఉండదు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల బారిన పడుతున్న మహిళల్లో 70 శాతం వాటిని బయటికి చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతున్నామని జాతీయ మహిళా సంఘం లోగడ స్పష్టం చేసింది. శిక్షల భయం లుప్తమై, విలువలు పతనమై పోనుపోను మృగాళ్ళ అరాచకాలు విశృంఖల మవుతున్నాయి.

స్త్రీలను కించపరుస్తూ వాళ్ళను విలాస వస్తువులుగా చూపిస్తూ మానవ విలువల్ని పతనం చేస్తూ వచ్చే సినిమాలు, సాంస్కృతిక వాతావరణం కూడా స్త్రీల మీద దాడికి కారణమవుతోంది. భారత దేశం సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు నడయాడతారన్నది భారతీయుల విశ్వాసం. పూజాది కాలం సంగతి దేవుడెరుగు మహిళలను మనుషులుగానైనా గుర్తించని హేయ సంస్కృతి దేశీయంగా వెర్రితలలు వేస్తోంది.

మగపిల్లలను ముద్దు చేస్తూ ఆడపిల్లలను ఆంక్షల పంజరంలో బంధిస్తున్న పితృస్వామ్య భావజాలం, వ్యక్తిత్వానికి వన్నెలద్దడంలో విఫలమవుతున్న విద్యా విధానం, నేరాల నియంత్రణలో యంత్రాంగం ఘోర వైఫల్యం... వెరసి కామపిశాచాల కర్మభూమిగా దేశం తరగని దుష్కీర్తిని మూటగట్టుకుంటోంది. ఈ పదేళ్ళ కాలంలో చిన్న పిల్లలపై లైంగిక నేరాలు అయిదు రెట్లు పెరిగాయన్న అధ్యయ నాలు, పసివారిని వేధించి అమానుషంగా హింసించే క్రౌర్యం భారత గడ్డపై పెచ్చరిల్లుతోందన్న 'యునిసెఫ్' విశ్లేషణలు- పైశాచికత్వ ప్రదర్శనలో అసాధరణ 'వృద్ధిరేటు'కు నిలువెత్తు దర్పణాలై వర్థిల్లుతున్నాయి. తమ వికృత కృత్యాలకు నోరులేని పసివాళ్ళను సైతం బలి తీసుకుంటున్నారు. బాల్యంలో సరిగ్గా లేని పరిసరాల వాతావరణం, కుటుంబ బంధాలు అంతంత మాత్రంగా ఉండటం, చెడు స్నేహాలు ఎక్కువగా యువత పెడదారుల్లో ప్రయాణించేందుకు కారణాలవుతాయని మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఇకపోతే... తమ ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవ డంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతీ యువకులు ఎందరో ఉన్నారు. ఇక ఇలా ప్రేమ వివాహం పేరుతో జరుగు తున్న మోసాలు కూడా అన్నీ ఇన్నీ కావు. కొన్ని సందర్భాల్లో మోసపో యిన యువతులు మోసంచేసిన వారి ఇంటి ముందు ధర్నాలు, నిరాహార దీక్షలు చేసినా, చేస్తున్న సంఘటనలు కోకొల్లలు.

వాస్తవంగా చదువు సంధ్యలు పెరిగే కొద్దీ విజ్ఞానం అర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పు రావాలి. సభ్యతా సంస్కారం మరింతగా పెరగాలి.

## లైంగిక వేధింపులు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేయాలంటే...

➢ సామాజికంగా నైతిక విలువల పతనానికి కారణమై, పశు వాంఛను ప్రేరేపిస్తున్న అశ్లీల వెబ్‌సైట్లు, స్మార్ట్‌ఫోన్లలో బూతు వీడియోల ఒరవడిపై ఉక్కుపాదం మోపాలి.

➢ ప్రాథమిక దశ నుంచే పాఠ్య పుస్తకాల్ని ప్రక్షాళించి బడి చదువు లోనే సంస్కార బీజాలు నాటే యత్నం ఊపందుకోవాలి. సామాజిక, నైతిక విలువలకు ప్రోది చేసేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలి.

➢ మత్తులో ముంచి సభ్యత సంస్కారాల పీక నులిమే మత్తు, మాదక ద్రవ్యాల్ని అరికట్టాలి.

➢ తల్లిదండ్రులు తమ బిడ్డల నడతను, నడవడిని గమనిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. పరాయి స్త్రీలను తల్లిగా, చెల్లిగా భావించేలా మగ పిల్లలకు చిన్నతనం నుండే తర్ఫీదునివ్వాలి.

పైన చెప్పిన విధంగా సమాజంలో ఎన్నో పెను మార్పులు జరిగితే గాని స్త్రీల మీద, ఉన్మాదుల హింస ఆగదు.




## మత ఘర్షణలపై మౌనం ఎందుకు?

దేశంలో జరుగుతున్న మత ఘర్షణలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా వున్నారని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాత్ ప్రశ్నించారు. కొన్ని రోజులుగా మత ఘర్షణలు జరుగుతున్నాయని, అయినా ప్రధాని మౌనంగానే వున్నారని ఆయన విమర్శించారు. దేశంలోని మత ఘర్షణలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా లోతైన దర్యాప్తు చేయించాలని, ఇలా చేసి, ఆయన ధైర్యాన్ని నిరూపించుకోవాలని గెహ్లాత్ సవాల్ విసిరారు. అల్లర్లు ఎందుకు జరిగాయి? ఎవరు చేశారు? అన్న నిజాలు ఈ విచారణ ద్వారానే వెలుగులోకి వస్తాయని రాజస్థాన్ సీఎం అభిప్రాయపడ్డారు. వాటివల్ల ఏ రాజకీయ పార్టీ లాభం పొందుతుందన్న విషయం కూడా బయటికి వస్తుందంటూ చురక లంటించారు. ప్రత్యర్థులను రాజకీయంగా దెబ్బతీయడానికి కేంద్రం దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తోందని మండిపడ్డారు.

## అన్నదాతలపై కేసులా?

దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై రుణ ఎగవేత కేసులు నమోదు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రుణాలు తీసుకొని ఎగవేసిన కార్పొరేట్ కంపెనీల అధిపతులను వదిలేసి.. పంట పెట్టుబడుల కోసం రుణాలు తీసుకునే రైతులను వేధిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసులు మోపడం ద్వారా అన్నదాతలను న్యాయస్థానాలకు లాగితే వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. రూ. వెయ్యి కోట్లు దోచుకొనే పెద్ద చేపలను వెంటాడాలని హితవు పలికింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రుణం తీసుకొని సకాలంలో చెల్లించలేదంటూ ఒక రైతుపై ఫిర్యాదుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'రూ.1,000 కోట్లు దోచుకున్న వారిపై మీరు కేసులు పెట్టరు. కానీ రైతుల విషయం వచ్చేసరికి అన్ని చట్టాలు వచ్చేస్తాయి' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అప్పీలును తోసిపుచ్చింది.

## మైనార్టీలను అణిచేస్తున్నారు..

మైనార్టీలను అణచివేస్తున్నారనీ, గాంధీజీని హత్య చేసిన వాళ్లను కీర్తిస్తున్నారంటూ కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ విమర్శనాస్త్రాలు సంధించారు. రాజస్తాన్‌లోని ఉదయ్ పూర్‌లో జరిగిన సదస్సులో కాంగ్రెస్ చీఫ్ సోనియా మాట్లాడుతూ.. 'కనీస ప్రభుత్వం.. గరిష్ట పాలన విధానం' అంటే ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం, మైనారిటీలపై క్రూరంగా దాడులు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడమేనా అని మోడీ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రజలు నిత్యం భయం, అభద్రతల మధ్య నలిగిపోయేలా మోడీ పరిపాలన కొనసాగు తుందని, ఇది బాధాకరమైన అంశమని అన్నారు.

## ఇదే అతిపెద్ద విధ్వంసం



మోడీ ప్రభుత్వం చేపడుతున్న బుల్డోజర్ డ్రైవ్‌పై ఢిల్లీ ముఖ్య మంత్రి కేజ్రీవాల్ విరుచుకు పడ్డారు. ఢిల్లీలోని 63 లక్షల ప్రజల నివాసాలు, దుకాణా లను ఈ బుల్డోజర్లు కూల్చివేస్తే.. స్వతంత్ర దేశంలో ఇదే అతి పెద్ద విధ్వంసం కానుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఆప్ ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. బిజెపి నేతృత్వంలోని పలు మునిసిపల్ కార్పొరేషన్‌లలో మోడీ ప్రభుత్వం చేపడుతున్న ఈ చట్ట వ్యతిరేక కార్యక్రమాన్ని అడ్డుకుని తీరతామని.. జైలుకి వెళ్లేందుకు కూడా వెనకాడమని అన్నారు. ఢిల్లీలో నిర్మాణాలు ప్రణాళికా బద్ధంగా జరగలేదని, 80 శాతానికి పైగా ఆక్రమణలు ఉన్నాయని.. అంటే 80 శాతం నిర్మాణాలను ధ్వంసం చేస్తారా అని ప్రశ్నించారు.

## ఎన్నికల వరకూ ఇంతే

జ్ఞాన్‌వాపి మస్జిదు వివాదం నేపథ్యంలో కాషాయ పార్టీపై ఎస్‌పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల వరకూ బీజేపీ ఇలాంటి అంశాలతో కూడిన విద్వేష క్యాలెండర్‌ను అమలు చేస్తుందని ఆయన మండిపడ్డారు. పాలక పార్టీ వాస్తవ అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందని అఖిలేష్ యాదవ్ అన్నారు. జ్ఞాన్‌వాపి వంటి ఘటనలను బీజేపీ ఉద్దేశపూర్వకంగానే తెరపైకి తీసుకువస్తుందని ఆరోపించారు. ఆహారం, ఇంధన ధరలు భగ్గుమంటున్నాయని... ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై వారి నుంచి ఎలాంటి సమాధానం లేదని పేర్కొన్నారు. ఎన్నికల వరకూ వివాదాస్పద అంశాలను ముందుకు తెచ్చి విద్వేషాన్ని వ్యాప్తి చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.

# పుతిన్‌పై నిషేధం విధించిన కెనడా..?



ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో రష్యాపై ప్రపంచ దేశాల ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆర్థిక పరమైన అంశాలపై నియంత్రణలు విధించిన కెనడా.. తాజాగా ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఆంక్షలు విధించడానికి సిద్ధమైంది. పుతిన్‌తో పాటు రష్యాకు చెందిన వెయ్యి మంది కెనడాలోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తూ రూపొందించిన బిల్లును సెనెట్‌లో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే పుతిన్‌తోపాటు అతని ప్రభుత్వంలోని అధికారులు, మిలటరీ పెద్దలు కెనడాలోకి ప్రవేశించడానికి వీలుండదు.

## నాటోలో చేరతాం

నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) సైనిక కూటమిలో చేరతామని ఫిన్లాండ్ అధికారికంగా ప్రకటించింది. నాటో సభ్యత్వం కోసం ఫిన్లాండ్ దరఖాస్తు చేయాలన్న నిర్ణయాన్ని క్యాబినేట్ సమావేశంలో తీసుకున్నట్లు అధ్యక్షులు సౌలి నీనిస్టో ప్రకటించారు. 'మా నిర్ణయం చరిత్రాత్మకం. ఫిన్లాండ్, దేశ పౌరుల భద్రతకు అత్యంత ముఖ్యమైనది. ఈ నిర్ణయం నార్డిక్ దేశాల మధ్య భద్రత, సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది' అని ప్రధానమంత్రి సన్నా మారిన్ పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ఫిన్లాండ్ పార్లమెంట్ ఆమోదిస్తుందనే విశ్వాసాన్ని ప్రధానమంత్రి వ్యక్తం చేశారు. నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు స్వీడన్ ప్రధానమంత్రి మాగ్డలీనా అండరన్స్ కూడా ప్రకటించారు. అయితే, రెండు ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను 'తీవ్ర తప్పిదం'గా రష్యా అభివర్ణించింది.

## లెబనాన్ ప్రభుత్వం ప్రజలను పేదరికంలోకి నెట్టేసింది

ఐక్యరాజ్యసమితి మొదటిసారి లెబనాన్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించింది. ప్రభుత్వం తన విధానాలతో ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందని, ప్రజలను పేదరికంలోకి నెట్టిందని, ఆ ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిందని వెల్లడించింది. లెబనాన్ రెండేళ్ళ నుంచి అసాధారణ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని దాని కారణంగా ప్రజలు దారిద్ర్యరేఖకు దిగవకు చేరుకున్నారని పేర్కొంది. ఇక నైనా అక్కడి ప్రభుత్వం మేల్కొవాలని కోరింది.

# సర్వత్రా

## ప్రపంచ దేశాలతో స్నేహమే కోరుకుంటున్నాం

ప్రపంచ దేశాలన్నింటితో తాము మిత్రత్వమే కోరుకుంటున్నామని అఫ్గానిస్తాన్ హోంమంత్రి కీలక ప్రకటన చేశారు. కేవలం అమెరికాతోనే కాకుండా ప్రపంచ దేశాలన్నింటితోనూ తాము సత్సంబంధాలనే నెరుపుతామని హోంమంత్రి సిరాజుద్దీన్ హక్కానీ కీలక ప్రకటన చేశారు. గత 20 ఏళ్లుగా తాము యుద్ధాలు, రక్షణ రంగం అంటూ గడిపేశామని గుర్తు చేసుకున్నారు. దోహా ఒప్పందం తర్వాత వాటి గురించి మాట్లాడొద్దని నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. ఇకపై వాటి ఊసే ఎత్తమని, అమెరికాతో సహా అన్ని దేశాలతో సత్సంబంధాలనే కోరుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

## యూఏఈ కొత్త అధ్యక్షునిగా జాయెద్ అల్ నహ్యాల్

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) నూతన అధ్యక్షునిగా షేక్ ముహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను నియమించినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాలకులు ప్రకటించారు. షేక్ ఖలీఫా బిన్ జాయెద్ అల్ నహ్యాన్ మృతి చెందడంతో ఆయన సోదరుడు ముహమ్మద్ బిన్ జాయెద్ యూఏఈ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అబుదాబిలోని అల్ ముష్రిఫ్ ప్యాలెస్‌లో ఫెడరల్ సుప్రీం కౌన్సిల్ సమావేశమై ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. షేక్ ముహమ్మద్ బిన్ జాయెద్ జనవరి 2005 నుంచి యూఏఈ సాయుధ దళాల డిప్యూటీ సుప్రీం కమాండర్‌గా కూడా పనిచేశారు.

## పాలస్తీనా జర్నలిస్టులపై హత్యాకాండ ఆపండి !

పాలస్తీనా జర్నలిస్టులపై, ప్రజలపై ఇస్రాయీల్ హత్యాకాండను, దాడులను ఆపాలంటూ మీడియా సంస్థలు కోరాయి. ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా వార్తా సంస్థలు ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశాయి. పాలస్తీనా జర్నలిస్టు షీరీన్ అబూ ఆఖిలా హత్యను మీడియా సంస్థలు తీవ్రంగా ఖండించాయి. దారుణమైన రీతిలో మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛ ఉల్లంఘన జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే దాడులు ఆపాలంటూ మీడియా సంస్థలు ప్రకటన జారీ చేశాయి. ఆమె మృతికి ఇస్రాయీల్ బలగాలది బాధ్యత కాదంటూ అధికారులు చేసిన ప్రకటన బాధ్యతా రాహిత్యమని విమర్శించింది. గత అనేక సంవత్సరాలుగా పాలస్తీనా జర్నలిస్టులు పదే పదే ఇటువంటి దాడులకు గురవుతున్నారని పేర్కొంది.

# పరుల సొమ్ము పాము వంటిది

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**దైవప్రవక్త** ముహమ్మద్(స) శిష్యులలో అబూదుజానా పేరొందిన వారు. ప్రతి రోజు ఫజర్ నమాజ్‌లో అంతిమ ప్రవక్త(స) వెనుక వరుసలో నిలబడి ఏకాగ్రతతో నమాజ్ చేసేవారు. నమాజు పూర్తయిన తర్వాత వెంటనే లేచి ఎవరినీ కలవకుండా, సలాం చెప్పకుండా మస్జిద్ నుండి వెళ్ళిపోవడం ఆయనకు పరిపాటిగా మారింది. ఇలా ప్రతిరోజు వెళ్ళడం మహాప్రవక్త(స)కు ఆశ్చర్యం కలిగింది.

ఒకరోజు ఫజర్ నమాజు అయిన వెంటనే అబూ దుజానా వెళ్ళిపోతుండగా దైవప్రవక్త ముహమ్మద్(స) ఆపి, ప్రతిరోజు నమాజు అయిన తర్వాత తొందరగా లేచి ఎందుకు వెళ్ళిపోతావ్ కారణమేమిటని అడిగారు.

నమాజు తరువాత అల్లాహ్‌తో దుఆ చేయకుండా వెళ్ళిపోతున్నావు. నీకు అల్లాహ్‌తో ఏమి అవసరం లేదా? బాధలు ఏమీ లేవా? సంతోషంలో ఉన్న అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవా? అని మెల్లగా మందలిస్తూ అడిగారు.

సృష్టికర్త అయిన అల్లాహ్ అవసరం లేకుండా ఒక్క క్షణం కూడా నేను ఉండలేను అని చెప్పారాయన.

నమాజ్ తరువాత అల్లాహ్‌ను అర్థించేందుకు రెండు చేతులెత్తి దుఆ చేయకుండా వెళ్ళిపోతున్నావు ఎందుకుని రెండోసారి అడిగారు దైవప్రవక్త (స).

దైవప్రవక్తా! మా ఇంటి ప్రక్కనే ఒక యూద సోదరుడి ఇల్లు ఉన్నది. అతని ఇంటి ఆవరణలో ఉన్న ఒక పెద్ద ఖర్జూరపు చెట్టు కొమ్మలు ఖర్జూరపు గుత్తులలో కొన్ని మా ఇంటివైపు ఖాళీ స్థలంలో వంగి ఉంటాయి. రాత్రి గాలికి కొమ్మల నుంచి ఖర్జూరపు పండ్లు మా వైపు ఖాళీ స్థలంలో రాలి కింద పడతాయి. ఇంట్లో పిల్లలు లేవకముందే ఆ ఖర్జూరాలను ఏరి ఒక గంపలో వేసి అతనికి అప్పజెబుతాను. పిల్లలు రాత్రికి ఖాళీ కడుపుతో నిద్రపోతారు. నిద్ర లేవగానే పండ్లను చూసి తినేస్తారని భయం వేసి ఇలా చేస్తాను, అందుకే దుఆ చేయకుండా వెళ్ళిపోతాను.


ఒకసారి ఇంటికి వెళ్ళడం ఆలస్యం అయ్యేసరికి పిల్లలు ఆకలి బాధతో పండ్లను ఏరుకుని తినబోయారు. పిల్లలను సముదాయించి వారి నోట్లో నుంచి పండ్లను బయటికి తీయవలసి వచ్చింది. ప్రక్కవారి సొమ్ము దొంగతనం చేసిన అపరాధంలో దేవుని ముందు సిగ్గుతో హషర్ మైదానంలో తలవంచవలసిన అవసరం వస్తుందన్నదే నా భయమంతా.

మస్జిదె నబవీలో ఒక మూల ప్రక్కన నిలబడి ఈ మాటలు వింటున్న హజ్రత్ అబూబకర్(రజి) ఎంతగానో చలించిపోయారు. అబూ దుజానా తన ఇంటి ముఖం పట్టారు. వెంటనే అబూబకర్(రజి) ఆ యూదుడి ఇంటికి వెళ్ళి విషయం చెప్పారు.

ఖర్జూరపు చెట్టుకు తగిన ధర చెల్లించి దుజానాకు బహుమతిగా అందించారు. కొన్ని నెలలు గడిచాక ఆ యూదుడికి అబూ దుజానా నిజాయితీ, ఆయన ప్రవర్తన గురించి తెలిసి చాలా ఆశ్చర్యపోయాడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) సమక్షంలో చేరిపోయాడు. ప్రియ శిష్యులలో ఒకరిగా మారిపోయాడు.

నేడు ఒకరి సొమ్మును దౌర్జన్యంగా, అక్రమంగా ఎలా దోచుకోవాలో, కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇతరుల హక్కులను భంగపర్చడం వల్ల సమాజంలో అశాంతి, అలజడులు, విచ్చలవిడిగా చెలరేగుతాయి. ఒక సామెత ఉంది : పరుల సొమ్ము పాము వంటిది.

**తుది గీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**